ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

మానవాళికి
TGTEL/25/A1132
# జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | మంగళవారం | 21.07.2026 | సంపుటి : 2 | సంచిక : 19 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు



## మూడు డిమాండ్లు నెరవేర్చాల్సిందే..

### లేదంటే నిరసనలు కొనసాగిస్తాం

**జెపి నడ్డాతో కాక్రోచ్ జనతా ప్రతినిధుల భేటీ**

**పరీక్షల నిర్వహణా లోపాలపై ప్రశ్నలు**

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టు**

**పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందచేత**

**న్యూఢిల్లీ, జూలై 20 :** కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'చలో పార్లమెంట్' ఉద్రిక్తంగా మారిన వేళ.. నిరసనలకు నాయకత్వం వహించిన వారితో కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్టీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ మంత్రికి వినతి పత్రం అందజేశారు. అందులో మూడు డిమాండ్లను పేర్కొన్నారు. 1. సోనమ్ వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయడం. 2. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. 3. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వడం. వీటిని సత్వరం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరసనలు కొనసాగిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని నడ్డా హామీ ఇచ్చారని భేటీ అనంతరం

-మిగతా 2 లో..

## పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగాలి

### దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది

**విక్రమ్ విజయవంతం.. యువకుల నైపుణ్యం**

**పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ**

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మిడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మిడియాతో ప్రధాని మాట్లాడారు.



న్యూఢిల్లీ, జూలై 20 : భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్-1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత

-మిగతా 2 లో..



10

## నత్తనడకన సర్ డిజిటైలేషన్

**కేవలం 65 శాతం మాత్రమే పూర్తయినట్లు సమాచారం**



03

## సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 37కు పెంపు

**లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి అర్జున్ రామ్‌పాల్**



## జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపులు

**ట్రైనీ ఐపిఎస్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ**

**ఆత్మతహత్యకు యత్నించిన ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి**

హైదరాబాద్, జూలై 20 : లైంగిక ఆరోపణల నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారం ఉత్కంఠగా మారింది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కేసులో ఊహించని పరిణామం ఎదురైంది. ఓ వైపు ఆయనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకోగా,మరోవైపు ఆయన ఆత్మహత్యకు పాల్పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ నేషనల్ అకాడమి చర్యలు తీసుకుంది. కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. నేషనల్ పోలీస్ అకాడమి ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం మేరకు ఉదయ్ కృష్ణారెడ్డిని

-మిగతా 2 లో..



## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

**ప్లాట్ల కోసం పది వరకు దరఖాస్తుల స్వీకరణ**

**రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి**

**ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు**

క్యూర్ పరిధిలో ప్లాట్ల కోసం ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్దిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ప్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

హైదరాబాద్, జనం వార్త ప్రతినిధి: క్యూర్ పరిధి లో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పు కొచ్చారు. లబ్దిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తా మని పేర్కొన్నారు. సోమవారం ఇందిర మ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు, ఇళ్ల బ్రోచర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. వారికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5లక్షల సహాయం అందజేస్తామని

-మిగతా 2 లో..

## మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం

**చివరి దశకు చేరుకున్న పరీక్షలు**

**నిపుణుల నివేదికల ఆధారంగా పునరుద్ధరణ పనులు**

**భద్రతా అనుమతుల తర్వాతే బ్యారేజీల నిర్వహణ**

**శాస్త్రీయ విధానంతో కాళేశ్వరం బ్యారేజీల పునరుజ్జీవనం**

**నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**





హైదరాబాద్, జనం వార్త ప్రతినిధి: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యారేజీలపై నిర్వహిస్తున్న సమగ్ర శాస్త్రీయ పరీక్షలు చివరి దశకు చేరుకున్నాయని, వాటి ఆధారంగా మరమ్మతులు, పునరుద్ధరణకు అవసరమైన డిజైన్ల రూపకల్పన జరుగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, బ్యారేజీల పునరుద్ధరణలో ప్రభుత్వం పూర్తిగా

-మిగతా 2 లో..



| నేటి చికెన్ ధరలు | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 140 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 167 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 259 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹98

## బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగరాలి

**పోచారం శ్రీనివాస్ రెడ్డికి గట్టిగా బుద్ధి చెప్పాలి**

**ఏ పార్టీలో ఉన్నాడో కూడా తెలియని స్థితిలో పోచారం**

**పార్టీలో చేరిన బాన్సువాడ నేతలకు కేటీఆర్ ఆహ్వానం**

హైదరాబాద్, జూలై 20 : బాన్సువాడలో కుడితిలో పడిన ఎలుకలా పోచారం పరిస్థితి తయారైంది. ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా ఆయన ఓడిపోవడం ఖాయం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎలక్షన్స్ ఎప్పుడు వచ్చినా బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడగొట్టడమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కేటీఆర్ సమక్షంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన మోరీల్ శ్రీనివాస్ రావు, పలువురు నాయకులు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు

-మిగతా 2 లో..





## ఆపదలో అండగా.. ఆర్టీసీ ఒకే కుటుంబం

**కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**డ్రైవర్ శంకర్ కుటుంబానికి రూ. 90.85 లక్షల సాయం**

**ఉద్యోగులంతా కలసి సమీకరించిన ధనం చెక్కు రూపంలో అప్పగింత**

**కార్మికుల కృషిని అభినందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

02

## ప్రభుత్వాసుపత్రుల్లో రక్షణ కరువు

**ఇందిరమ్మ పాలనలో బాలింతకు కూడా భరోసా లేదు**

**బాన్సువాడ ఘటనపై స్పందించని ప్రభుత్వం**

**నిమ్స్‌లో బాలింతను పరామర్శించిన హరీష్ రావు**



హైదరాబాద్, జూలై 20 : ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స వికటించి, నిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాలింతలను హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటన జరిగిన

-మిగతా 2 లో..



# పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగాలి

(మొదటిపేజీ తరువాయి)

యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

# జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపులు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్‌పీఏ నుంచి అధికారులు పంపించేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తన గురించి మొదట ఎన్‌పీఏ అధికారులకు మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. సీసీటీవీ కెమెరాల ఆధారాలతో పాటు అన్ని ఆధారాలు సేకరించాక ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమేనని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. దీంతో తక్షణమే పోలీస్ అకాడమీ నుంచి నుంచి సస్పెండ్ చేస్తూ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సర్వీస్‌లో జాయినింగ్‌కు సంబంధించి డీవోపీటీ దే తుది నిర్ణయం అని నేషనల్ పోలీస్ అకాడమీ అధికారులు చెబుతున్నారు. ఇదిలావుండగానే ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఎర్రగడ్డలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కృష్ణారెడ్డికి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడంటూ మరో మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. దీంతో అత్తాపూర్ పోలీసులు కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ అంశంపై ఎనిమిది రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ ట్రైనీ ఐపీఎస్‌కు పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే ఈ ఘటన అనంతరం సొంతూరుకు వెళ్లిపోయిన కృష్ణారెడ్డి.. ఆదివారం సాయంత్రం మోతీనగర్‌లోని స్నేహితుడి ఇంటికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించి అతన్ని ఎర్రగడ్డలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. కాగా, ఆత్మహత్యకు ముందు తన తప్పేమీ లేదని ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ స్టేటస్ పెట్టడం గమనార్హం. తనతోపాటు శిక్షణ పొందుతున్న తోటి ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఈ ఏడాది జూన్ 23 నుంచి తనను లైంగికంగా వేధిస్తున్నాడని, వాట్సాప్ ద్వారా అసభ్యకర మెసేజ్‌లు పంపి బూతులు తిడుతున్నాడని ఓ మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి రహస్యంగా తన వ్యక్తిగత ప్రైవేట్ వీడియోలను చిత్రీకరించి తీవ్రంగా బెదిరిస్తున్నాడని, ఆ వీడియోలను తన భర్తకు పంపి మానసికంగా వేధించడంతోపాటు వాటిని సోషల్ మీడియాలో పెడతానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల తనను బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి ప్రైవేట్ భాగాలను తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడటంతోపాటు చంపేందుకు ప్రయత్నించాడని, మెడపై కత్తి పెట్టి ఆ గది నుంచి బయటకు వెళ్లకుండా నిర్బంధించాడని ఆ అధికారి ఆరోపించారు. దీంతో ఉదయ్ కృష్ణారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న అధికారులు.. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మహిళా ఐపీఎస్ ట్రైనీ చేసిన ఆరోపణలు నిజమని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. ఈ కమిటీ నిర్ణయంతో జాతీయ పోలీస్ అకాడమీ నుంచి ఉదయ్ కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. దీనికి ముందు తన తప్పేమీ లేదంటూ వాట్సాప్‌లో స్టేటస్ పెట్టాడు. ఇప్పుడు ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది.



# మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

శాస్త్రీయ విధానాన్నే అనుసరిస్తోందని స్పష్టం చేశారు. నిపుణులు భద్రతపై పూర్తి స్థాయిలో ధ్రువీకరించే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకురాబోమని వెల్లడించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ , నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వంటి దేశంలోని అత్యున్నత సాంకేతిక సంస్థలు నేల స్వభావం, పునాదులు, కాంక్రీట్ నిర్మాణం, ఇతర నిర్మాణ భాగాలపై విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆ పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని, వాటి ఫలితాలను ఐఐటీ బొంబాయికి పంపించగా, అక్కడ నిపుణులు సమగ్ర పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక అంచనాల ప్రకారం డయాఫ్రం వాల్ నిర్మాణం పునరుద్ధరణలో భాగం కావచ్చని భావిస్తున్నప్పటికీ, అన్ని సాంకేతిక నివేదికలను పరిశీలించిన అనంతరమే తుది మరమ్మతుల విధానాన్ని నిర్ణయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ , కేంద్ర జల సంఘం సూచనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. పునరుద్ధరణ పక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు భారత సైన్యంలో సేవలందించిన అనుభవజ్ఞులైన ఇంజినీర్ల సేవలను ప్రభుత్వం వినియోగిస్తోందని, కల్నల్ పరిక్షిత్ మెహ్రా నేతృత్వంలోని సమన్వయ కమిటీ పరీక్షలు, సాంకేతిక ప్రణాళికలను పర్యవేక్షిస్తూ పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. భద్రతే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాస్త్రీయ పరీక్షలు, నిపుణుల రూపకల్పన, చట్టబద్ధ భద్రతా అనుమతులు పూర్తయిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ కీలక ప్రాజెక్టును శాశ్వత భద్రతతో పునరుద్ధరించి రాష్ట్ర అవసరాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి పొంగులేటి వెల్లడించారు. పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకునే అవకాశం లేదని చెప్పుకొచ్చారు. మొదటి దశలో 16నియోజకవర్గాల్లో ఇస్తున్నామని.. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయా పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామనిపేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అవుతున్నాయని ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేశామని వెల్లడించారు. ఇంటి స్థలంలేని పేదలకు కూడా వీటిని అందజేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి వివరించారు. లాభం, స్వార్థం లేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తున్నామని పేర్కొన్నారు. అజఖీఇ పరిధిలో ఇళ్లు కట్టించే పథకాన్ని ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం పదహారు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని చెప్పుకొచ్చారు. 528 అడుగుల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో తప్పిదాలతో అప్పుడు కట్టిన ప్లాట్లు ఉపయోగపడకుండా పోయాయని చెప్పారు. నగరానికి దూరంగా 35 కిలోమీటర్ల దూరంలో కట్టడంతో పేదలు అక్కడకు వెళ్లలేదని తెలిపారు. చదరపు గజానికి లక్షల విలువ ఉండే కోర్ ప్రాంతంలో టవర్లు నిర్మించి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారని అన్నారు. ఈ పథకం ఫెయిల్ అయితే విమర్శించాలని కొందరు సంతోషపడ్డారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు ఇంటి కల నెరవేర్చాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇలా ఇళ్లు కట్టించి ఇవ్వడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రం తమ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఆ లక్ష్యంతోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే కాంగ్రెస్ ప్రభుత్వం ఒఎఉ ఇళ్లను నిర్మించిందని తెలిపారు. నగరంలో చాలాచోట్ల హౌసింగ్ బోర్డు కాలనీలు ఉన్నాయని ప్రస్తావించారు. ఎంత విలువైన భూమి అయినా పేదలకు ఇవ్వాలని తాము నిర్ణయించామని చెప్పుకొచ్చారు. పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరుగుతోందని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు. మొదటి విడతలో 16నియోజకవర్గాల్లో 7680 ఎ÷-లాట్లను నిర్మిస్తామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.




క్యూర్ పరిధిలోని ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో స్థలం లేని పేదలు కిరాయి ఇళ్లలో ఉంటున్నారని తెలిపారు. అజఖీఇలో పేదలకు తమ ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే పథకాన్ని ప్రారంభించామని వెల్లడించారు. గత ప్రభుత్వం హౌసింగ్ విభాగాన్నే రద్దు చేసిందని చెప్పుకొచ్చారు. తాము దాన్ని పునరుద్ధరించామని అన్నారు. బల్కంపే ట ఎల్లమ్మ బోనాల ముందు అజఖీఇలో ఈ పథకం ప్రారంభించామని వెల్లడించారు. మళ్లీ వచ్చే బోనాల నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయా లని టార్గెట్‌గా పెట్టుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## నకిరేకల్ వాసి నాగరాజుకు లక్ష బహుమానం

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరును ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సహేతుకంగా వివరించిన నల్గొండ జిల్లా నకిరేకల్ గ్రామానికి చెందని కొండా నాగరాజుకు లక్ష రూపాయిల నగదు బహుమతిని మంత్రులు అందజేసి సత్కరించారు. ఈ పథకానికి పేరు సూచిస్తే లక్ష నగదు బహుమతిని ఇస్తామని గతంలోనే ప్రకటించారు. ఈ క్రమంలో నాగరాజుని అదృష్టం వరించింది. హైదరాబాద్ ప్రాంతంలోని క్యూర్ పరిధిలో తొలి విడతగా 16 నియోజవర్గాల్లో ప్రయోగాత్మకంగా నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తున్నారు. త్వరలో మరో 8 నియోజకవర్గాలలో కూడా ఈ పథకం అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

# మూడు డిమాండ్లు నెరవేర్చాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)

సీజేపీ ప్రతినిధులు ఎక్స్ వేదికగా తెలిపారు. నీట్, సహా వివిధ ప్రశ్న పత్రాల లీకేజీలకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కారణమని సీజేపీ ఆరోపించింది. అయినా, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని, ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆక్షేపించింది. మరోవైపు సీజేపీ ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు కేంద్ర మంత్రి నడ్డా కూడా ఎక్స్‌లో పోస్టు చేశారు. స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు జరిగినట్లు చెప్పారు. " ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇవాళ ఉదయం ఆందోళనకారుల నుంచి తొలిసారి ప్రతిపాదన వచ్చింది. ఉదయం 11: 50 నిమిషాలకు మా చర్చలు ప్రారంభమయ్యాయి. తొలుత మౌఖికంగా చర్చలు జరిపాం. ఆ తర్వాత సాయంత్రం 4 గంటల సమయంలో లిఖిత పూర్వకంగా వినతిపత్రం సమర్పించారు" అని నడ్డా ఎక్స్‌లో పేర్కొన్నారు. నిరసనకారులంతా ఆందోళన విరమించి,



పరిస్థితులను సాధారణ స్థాయికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఆందోళకారులు సంయమనం పాటించాలని దిల్లీ పోలీసులు కోరారు. తప్పుడు సమాచారం, వదంతుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

# ఆపదలో అండగా.. ఆర్టీసీ ఒకే కుటుంబం

**హైదరాబాద్, జూలై 20 :** టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని... వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు 'చేయూత' కార్యక్రమం ద్వారా స్వచ్ఛందంగా సేకరించిన రూ. 90,85,500 తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల భారీ ఆర్థిక సహాయ చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వై.నాగిరెడ్డి ల చేతుల మీదుగా దివంగత డ్రైవర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు ఈ చెక్కును అందజేసి సంస్థ తరఫున పూర్తి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత కోల శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులందరూ అండగా నిలవడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అర్ధరాత్రి వేళ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అందులో భాగంగానే దివంగత శంకర్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నామని, అలాగే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని ప్రకటించారు. గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారని మంత్రి విమర్శించారు. అయితే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీలోని ప్రతి



సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం నెలకు రూ. 300 కోట్లు ఆర్టీసీకి విడుదల చేస్తోందని, ఈ పథకం వల్ల పనిభారం పెరిగినప్పటికీ సిబ్బంది ఎంతో కష్టపడి విజయవంతం చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా రాఖీ పౌర్ణమి వంటి పండుగ రోజుల్లోనూ మహిళా ప్రయాణికుల కోసం కార్మికులు తమ సోదరులకు రాఖీ కట్టి మరీ విధులు నిర్వహించడం వారి నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు. కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రూ. 6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సహా ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని మంత్రి స్పష్టం చేశారు. రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల సౌలభ్యం, కార్మికుల సంక్షేమం అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా సంస్థను ముందుకు తీసుకెళ్తామన్నారు.

# బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగరాలి

(మొదటిపేజీ తరువాయి)

కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ. గతంలో బాన్సువాడలో గులాబీ జెండాను ఎగురవేశాం. పెద్దాయన పోచారంను గెలిపిస్తే పోయి పోయి మునిగిపోయే పడవ కాంగ్రెస్ పార్టీలో చేరిండని ఎద్దేవా చేశారు. ఆయన కాంగ్రెస్‌లో చేరి కుడిదిలో పడ్డ ఎలుకలా గిలగిలా కొట్టుకుంటున్నడు. ఈ సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బాన్సువాడలో మరోసారి గులాబీ జెండా ఎగరేసే సమయం వచ్చిందని ఆయన అన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ తరఫున గెలిచి పార్టీ మారారని, ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి కూడా బాగోలేదని ఆయనకు అర్థమైందన్నారు. ఈ గొంతులో ప్రాణం ఉన్నంత వరకు పార్టీ మారనని చెప్పిన పోచారం చివరకు మాట తప్పి పార్టీ మారారని ఆరోపించారు. స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు తాను ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకునే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. పోచారం తన రాజకీయ భవిష్యత్తును తానే సమాధి చేసుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా చేతులెత్తేశారని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి కూడా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఏ సభ పెట్టినా కేసీఆర్‌ను విమర్శించడమే సీఎం పనిగా మారిందన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. యూరియా



కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, షాపుల్లో ఎరువుల సంచులు లేకపోతే యాప్‌లో కనిపించినా ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఢిల్లీకి పంపేందుకు సంచులు ఉంటున్నాయని, కానీ రైతులకు మాత్రం అందడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పిల్లర్లు కుంగి 31 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి ప్రతిరోజూ నీరు కిందకు వెళ్తున్నా పంపింగ్ చేయడం లేదన్నారు. రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్‌కు వెళ్తే ప్రభుత్వం మాత్రం 'కోల్డ్ స్టోరేజ్'లోకి వెళ్లిపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం అవసరమైతే రక్తమే కాదు ప్రాణాలు కూడా ఇస్తామని బీఆర్ఎస్ ఎప్పుడూ చెప్పిందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



# ప్రభుత్వాసుపత్రుల్లో రక్షణ లేకుండా పోయింది

(మొదటిపేజీ తరువాయి)

పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదుగురు బాలింతలు నిమ్స్‌లో చికిత్స పొందుతున్నార హరీశ్‌రావు తెలిపారు. వీరిలో ముగ్గురు డయాలసిస్‌పై ఉన్నారని పేర్కొన్నారు. తెల్లరక్తకణాలు తగ్గాయి.. కిడ్నీ, లంగ్స్ ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారని చెప్పారు. బాలింతల నుంచి పసిగుడ్డులకు ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిపారు. బాలింతల నుంచి పాలు తాగడం వల్ల నీలోఫర్‌లో పసిగుడ్డులు చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలింతలు పూర్తిగా కోలుకోకుండా పసిగుడ్డులను ఎవరు చూసుకుంటారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరుగురికి 10వ తేదీన ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, నలుగురికి 11వ తేదీన సిజేరియన్ చేశారని హరీశ్‌రావు తెలిపారు. థియేటర్ మెయింటెనెన్స్ సరిగ్గా లేక ఇన్‌ఫెక్షన్ సోకిందని బాధితులు అంటున్నారని అన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కూడా కారణమని అంటున్నారని అన్నారు. కాలం చెల్లిన మందులు వాడినందుకే ఈ పరిస్థితి వచ్చింటున్నారని తెలిపారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. ఘటన జరిగిన పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. వైద్యారోగ్య అధికారులు కనీసం పరామర్శించిన పాపాన పోలేదని విమర్శించారు. ఘటన నుంచి గురించి పూర్తిస్థాయి విచారణకు ఆదేశించలేదని అన్నారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక పేషెంట్ నగలు అమ్మి, అప్పు తెచ్చి వైద్య చికిత్సలు చేయించామని కుటుంబీకులు చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. ఇంత జరిగినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు. ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కేసీఆర్ హయాంలో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్, బాలింతలకు కేసీఆర్ కిట్‌లు ఇచ్చామని తెలిపారు. మహిళల ఆరోగ్యం కోసం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. అమ్మ ఒడి వాహనాల్లో బాలింతలను సురక్షితంగా ఇళ్లకు చేర్చామని చెప్పారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు గణనీయంగా తగ్గాయని అన్నారు.




# నత్తనడకన సర్ డిజిటైలేషన్

## కేవలం 65 శాతం మాత్రమే పూర్తయినట్లు సమాచారం

**హైదరాబాద్,జూలై20 :** రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియకు సంబంధించిన డిజిటలైజేషన్ నత్తనడకన సాగుతున్నది. మరోవైపు అధికారులేమో 90 శాతం పూర్తయిందంటూ ప్రకటనలు ఇస్తున్నారు. బిఎల్‌వోలు తమ ఇంటికి రాలేదని, తమకు ఫారాలు ఇవ్వలేదని పలుచోట్ల నుంచి వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్ ల పంపిణీ దాదాపు పూర్తయినప్పటికీ వాటికి సంబంధించిన ఆన్‌లైన్ డాటా ఎంట్రీ పక్రియ మందకొడిగా నడుస్తున్నది. ఆదివారం సాయంత్రం వరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కార్యాలయానికి అందిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 2,19,23, 435 ఈఎఫ్‌ల 64.81 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. గ్రామీణ జిల్లాలతో పోలిస్తే ఎకువ ఓటర్లున్న నగర, ఐటీ కారిడార్ పరిధిలోని జిల్లాల్లో ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ మెల్లగా సాగుతున్నది. మేడ్చల్ మలాజిగిరి జిల్లాలో అత్యంత తకువగా 37.30శాతం ఈఎఫ్‌లు మాత్రమే డిజిటలైజ్ కాగా, హైదరాబాద్ జిల్లాలో 39.59శాతం , రంగారెడ్డి జిల్లాలో 48.52శాతం ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ పూర్తయింది. వీటితో పోలిస్తే గ్రామీణ జిల్లాలు చాలా ముందంజలో ఉన్నాయి. ఇప్పటివరకు 88.43? ఈఎఫ్‌ల డిజిటలైజేషన్‌తో యాదాద్రి భువనగిరి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో సిద్దిపేట (83.55శాతం), నల్లగొండ (82.74శాతం), కుమ్రంభీం ఆసిఫాబాద్ (81.63శాతం) జిల్లాలు ఉన్నాయి.

# పామాయిల్ పెంపకం రైతులకు ఎంతో మేలు

**వర్షాభావంలోనూ పంటరకు ధోకా లేదు**

**పామాయిల్ ధరల పెంపునకు కృషి చేస్తున్నాం**

**అంజనాపురంలో గోద్రెజ్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం**

**మంత్రి తుమ్మలతో కలసి ప్రారంభించిన భట్టి**





**ఖమ్మం, జులై 20 :** పామాయిల్ ధర పెంపునకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లా అని పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉందని.. వివిధ కారణాలతో సీఎం రాలేకపోయారని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి తన శుభాకాంక్షలు తెలిపారని అన్నారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించిన గోద్రెజ్ సంస్థకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి విశేషంగా కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి అభినందనలు చెప్పారు. ఖమ్మం జిల్లా రైతన్నలు అన్ని రకాల పంటలు సాగు చేస్తారని వెల్లడించారు. తాను ఎన్నో రకాల పంటలు సాగు చేశానని ఏ పంటకు రాని దిగుబడి ఆయిల్ పామ్‌కు వచ్చిందని మంత్రి తుమ్మల స్వయంగా తనతో చెప్పారని అన్నారు.



చివరకు ప్రకృతి విపత్తులను కూడా ఈ పంట తట్టుకొని నిలబడుతుందని చెప్పుకొచ్చారు. పామాయిల్ సాగు చేసిన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వెల్లడించారు. దేశంలో 25 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ అవసరం ఉందని తెలిపారు. దేశంలో కేవలం 12 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ మాత్రమే ఉత్పత్తి అవుతుందని చెప్పుకొచ్చారు. 1992లో ప్రారంభించిన పామాయిల్ సాగు ఇప్పటికి దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపే స్థాయికి వచ్చిందని భట్టి విక్రమార్క వివరించారు. గతంలో పామాయిల్ టన్ను గెల ధర రూ.12000లు ఉంటే.. నేడు టన్ను ధర రూ.23 వేలకు పెరిగిందని వెల్లడించారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం.. ఖమ్మం జిల్లా అన్నదాతలకు ఓ వరమని ఉద్ఘాటించారు. వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదిక కాబోతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో అనేక రకాల పరిశ్రమలు ఇక్కడికి రాబోతున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులంతా ఈ పంట సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్‌తో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ కింద ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తయిందని, మరో ఆరు ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణ భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలన్నదే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణ భారతదేశ నేతలందరూ ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం తగ్గించాలని కోరుతున్నామని మంత్రి చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు మంత్రి తుమ్మల. తన యాభై సంవత్సరాల వ్యవసాయ అనుభవంలో ఎన్నో పంటలు పండించామని, ఏ పంటకు రాని ఆదాయం దీనికి వస్తుందన్నారు. ఆయిల్ పామ్‌ను ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన నాటి నుంచి తాను కూడా సాగు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఎల్‌నినో ప్రపంచాన్ని కబళించే పరిస్థితి ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దాని కారణంగా రుతుపవనాలు సరిగా రాలేదని, మానవజాతి చేసిన విధ్వంసం తిరిగి మన పాలిటే మహమ్మారిగా మారిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని, ఉద్యానవన పంటల సాగుతో భూములను చల్లబరచాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

## నేడు, రేపు బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

**వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలిరానున్న భక్తులు**

**ట్రాఫిక్ డైవర్షన్ ప్రకటించిన పోలీసులు**



**హైదరాబాద్, జులై 20 :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆషాడం బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం, రథోత్సవం.. మంగళవారం, బుధవారం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా పోటెత్తనున్నారు. ఈ నేపథ్యంలో బల్కం పేట పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోనుంది. దాంతో ఆ ప్రాంతం లో ట్రాఫిక్‌ను మరో మార్గంలో మళ్లిస్తామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ వెల్లడించారు. గ్రీన్ ల్యాండ్స్, సత్యం థియేటర్ నుంచి బల్కంపేట, ఫతేనగర్ వైపు వెళ్లే వాహనాలు ఎస్ఆర్ నగర్ టి జంక్షన్, బీకే గూడ మీదుగా సనత్‌నగర్ వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. ఫతేనగర్ ఫ్లై ఓవర్ నుంచి బల్కంపేట వైపు వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కట్టమైసమ్మ గుడి, బేగంపేట వైపు మళ్లిస్తామని పేర్కొన్నారు. గ్రీన్‌ల్యాండ్స్ – ఫుడ్ వరల్డ్ నుంచి బల్కంపేట వైపు వాహనాలకు నో ఎంట్రీ అని చెప్పారు. బేగంపేట, కట్టమైసమ్మ ఆలయం నుంచి బల్కంపేట వైపు వచ్చే ట్రాఫిక్‌ను సత్యం థియేటర్, మైత్రీవనం వైపు మళ్లిస్తామని అన్నారు. ఎస్ఆర్ నగర్ టి జంక్షన్ నుంచి ఫతేనగర్ వరకు ఉన్న చిన్న సందులు అన్నీ మూసివేస్తామని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ఆర్ అండ్ బీ కార్యాలయం, జిహెచ్ఎంసి గ్రౌండ్, నేచర్ క్యూర్ హాస్పిటల్ వద్ద సౌకర్యం కల్పించామని వివరించారు. ఈ ప్రాంతం వైపు వచ్చే వారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని వాహనదారులకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## నేడు, రేపు కొడంగల్‌లో సిఎం పర్యటన

**హైదరాబాద్, జులై 20 :** నేటి నుంచి రెండు రోజులపాటు కొడంగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఎడ్యుకేషన్ హబ్ పనుల పరిశీలించి, నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు దుద్యాల్ మండలం, హకీంపేట గ్రామంలోని ఎడ్యుకేషన్ హబ్ ను పరిశీలించనున్నారు. సాయంత్రం 5 గంటలకు కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించనున్నారు. రాత్రికి కొడంగల్ లోనే బస చేయనున్న ముఖ్యమంత్రి, బుధశారం 10 గంటలకు స్థానిక నాయకులు, సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ప్రకటించారు.

## నగరంలో ముగ్గురు మైనర్ బాలికల అదృశ్యం

**తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు**

**హైదరాబాద్, జూలై 20 :** హైదరాబాద్‌లో ముగ్గురు మైనర్ బాలికలు ఒకేసారి అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. దోమలగూడ ప్రాంతానికి చెందిన ముగ్గురు బాలికలు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కార్మిక కుటుంబాలు దోమలగూడలోని ఫరీద్ బస్తీలో నివాసం ఉంటున్నాయి. అదే ప్రాంతానికి చెందిన సహిత కుమారి, స్నేహ కుమారి, లత అనే ముగ్గురు మైనర్ బాలికలు ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వారి తల్లిదండ్రులు దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి బాలికలు వెళ్లిన మార్గాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. విచారణలో బాలికలు మొదట హిమాయత్‌నగర్‌లో ఓ ఆటో ఎక్కినట్లు గుర్తించారు. ఆ తర్వాత వారు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నట్లు సీసీటీవీ ఫుటేజీలో నమోదైంది. దర్యాప్తులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి బాలికలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం రెండు రైల్వే స్టేషన్లలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ వారి కదలికలను ట్రాక్ చేస్తున్నారు. బాలికలు తమ స్వగ్రామమైన ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి ఉండొచ్చనే అనుమానంతో పోలీసులు ఆ దిశగా కూడా విచారణ చేపట్టారు. రైల్వే అధికారులు, ఇతర జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. మరోవైపు ముగ్గురు బాలికల ఆచూకీ ఇప్పటికీ లభించకపోవడంతో వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. బాలికలను వీలైనంత త్వరగా గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యం

**వెల్ఫేర్ సొసైటీ సమీక్షలో డిజిపి సివి ఆనంద్**

**హైదరాబాద్, జులై 20 :** పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమమే తెలంగాణ పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్స్పష్టం చేశారు. డీజీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ వెల్ఫేర్ సొసైటీ , ఆరోగ్య భద్రత విభాగాల సమీక్ష సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, వాటి పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారి కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పించేందుకు శాఖ అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పోలీసు పిల్లల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే జేఈఈ, నీట్‌తో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక ఆర్థిక సహాయం, స్కాలర్‌షిప్‌లు అందిస్తూ ఉన్నత విద్యను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సిబ్బందికి వివాహ రుణాలు, వైద్య రుణాలు, విద్యా రుణాలు, మెరిట్ స్కాలర్‌షిప్‌లు, మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు, అదనపు కార్పస్ ఇన్సూరెన్స్, వివిధ గ్రాంట్లు వంటి సంక్షేమ పథకాల ద్వారా సమగ్ర ఆర్థిక భద్రత కల్పిస్తున్నట్లు డీజీపీ వివరించారు . వెల్ఫేర్ సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేసి పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించాలని, హోదాల వారీగా వెల్ఫేర్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. శాఖకు చెందిన కమర్షియల్ కాంప్లెక్స్‌ల అద్దె రేట్లను పారదర్శకంగా నిర్ణయించి, సిబ్బందికి, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా లీజుకు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో డీజీ మహేష్ ఎం. భగవత్, ఏడీజీ సంజయ్ జైన్, షహనవాజ్ ఖాసిం, గజరావు భూపాల్, ఉదయ్ కుమార్ రెడ్డి, శరత్ కుమార్, గోపీ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## మూడు కాదు.. ఒక్కదాంట్లో గెలిచి చూపండి

**మరోమారు బిజెపి నేతలకు రాజాసింగ్ సవాల్**

**హైదరాబాద్, జూలై 20 :** నగరంలో మూడు కార్పొరేషన్లు గెలుస్తామని బిజెపి నేతలు ప్రకటించడాన్ని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎద్దేవా చేశారు. మూడు కాదు.. ఒక్కటైనా గెలిచి చూపాలని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో బిజెపి నేతల తీరుపై, రాష్ట్రంలో బీజేపీ పరిస్థితిపై ఆ పార్టీ బహిష్కృత నేత రాజాసింగ్ సెటైర్లు వేశారు. బండి సంజయ్, ఈటల కలిస్తే పార్టీ అధికారంలోకి వస్తుందా.. అని పార్టీ రాష్ట్ర నేతలను ప్రశ్నించారు. వారి మధ్య సమస్యలు ఉండవచ్చని, పార్టీలో సీనియర్ నేతలు, కార్యకర్తల పరిస్థితి ఏంటని నిలదీశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు కార్పొరేషన్‌లు గెలుస్తామని చెబుతున్నారని, ఒక్క కార్పొరేషన్‌లో సగం సీట్లయినా గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. బీజేపీలో కొందరికి అధ్యక్ష పదవి దక్కకుండా చేసేందుకే రాంచందర్ రావును కూర్చొబెట్టారని పేర్కొన్నారు. రాంచందర్‌రావు చేతులు కట్టేసి పని చేయమంటే ఎట్లా..? అంటూ ప్రశ్నించారు. రాంచందర్‌రావు ఎంత బాధలో ఉన్నారో తెలుసని, ఒకరు చెప్పినట్టు పని చేయాలంటే ఎలా చేస్తారంటూ పరోక్షంగా కిషన్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నేతల్లో సయోధ్య లేదని, అలాగే, పార్టీ పటిష్టతపై అవగాహన లేదన్నారు.

## బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించిన కానిస్టేబుల్


**పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్**

**నల్లగొండ, జూలై 20 :** బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడని ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ మేరకు గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణను నల్గొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల సైకిల్‌పై వెళ్తున్న ఓ బాలికను నిందితుడు అడ్డగించి, ఆమెతో అసభ్యంగా వ్యవహరించాడు. అనుచితంగా తాకి వేధించాడు. ఇంటికి వెళ్లాక బాలిక ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. వారు వెంటనే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఘటనాస్థలిలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. నిందితుడు మాస్క్ ధరించి, పలుచోట్ల తిరిగినట్లుగా గుర్తించారు. సదరు మాస్క్ వ్యక్తి గురించి ఎంక్వైరీ చేయగా.. గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ అని తెలిసింది. దీంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, నకిరేకల్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో కూడా సత్యనారాయణపై రెండు పోక్సో కేసులు నమోదైనట్లుగా తెలుస్తోంది. స్టేషన్‌కు వచ్చే మహిళల పట్ల కూడా అనుచితంగా ప్రవర్తిస్తాడనే ఆరోపణలు ఉన్నాయి.

## బహదూర్‌గూడ భూములపై హైకోర్టు కీలక నిర్ణయం

**తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు చర్యలు తీసుకోవద్దని ఆదేశం**

**హైదరాబాద్, జులై 20 :** శంషాబాద్ మండలం, బహదూర్‌గూడ భూములపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బహదూర్‌గూడ భూముల్లో ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాలు తమవేనంటూ నలుగురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు సోమవారం ఆ పిటిషన్‌పై విచారణ జరిపింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాల భూమిలో పిటిషనర్లు 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. పిటిషనర్లుగా ఉన్న నలుగురు రైతుల పాస్ పుస్తకాల్లో అధికారుల సంతకాలు లేవని, కొన్నేళ్లుగా అక్కడ వ్యవసాయం చేస్తున్నారు కాబట్టే తమ భూమి అంటున్నారని ఆయన హైకోర్టుకు తెలిపారు. ఆ భూమి ప్రభుత్వ భూమి అని అన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలతో ఏకీభవించింది.




తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నలుగురు రైతుల భూముల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశాలు జారీ చేసింది.

## బిఆర్ఎస్‌తోనే నా ప్రయాణం

**పార్టీ మార్పు ప్రచారాలపై మల్లారెడ్డి వివరణ**



**హైదరాబాద్, జూలై 20 :** పార్టీ మారుతున్నారనే ప్రచారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పందించారు. తాను ఏ రాజకీయ పార్టీలోనూ చేరబోనని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఇటీవల తన పార్టీ మార్పుపై సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో వస్తున్న వార్తలకు ఆయన చెక్ పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన మల్లారెడ్డి.. పార్టీ మారే ప్రసక్తే లేదన్నారు. తనపై జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. బీఆర్ఎస్ నాయకత్వంపై తనకు పూర్తిగా విశ్వాసం ఉందన్నారు. పార్టీ బలోపేతం కోసం గతంలో ఎలా పనిచేశానో, ఇకముందు కూడా అదే విధంగా పనిచేస్తానని తెలిపారు.

## సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 37కు పెంపు

**లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి అర్జున్ రామ్‌పాల్**

**న్యూఢిల్లీ,జులై 20 :** సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను మరోసారి పెంచేందుకు కేంద్రం సిద్ధమైంది. దీనికోసం రూపొందించిన బిల్లును కేంద్రం లోక్‌సభలో సోమవారం ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) అమెండ్‌మెంట్ బిల్, 2026ను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌పాల్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీనిప్రకారం ఇప్పటికే ఉన్న సుప్రీంకోర్టు యాక్ట్, 1956ను మార్చనున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజే కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టడం విశేషం. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 33 మంది జడ్జీలున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య 37కు పెరుగుతుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో నీట్ యూజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ప్రభుత్వం ఈ బిల్లును కేంద్రం సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు కొత్తదేం కాదు. దీనిపై కేంద్రం గతంలోనే ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనికి రాష్ట్రపతి కూడా ఇంతకుముందే ఆమోదం తెలిపారు. ఈ ఆర్డినెన్స్ ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను 37కు పెంచుకోవచ్చు. అయితే, దీన్ని పూర్తిస్థాయి చట్టంగా తీసుకురావాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. అందుకోసమే బిల్లును రూపొందించి, ప్రవేశపెట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 ప్రకారం సుప్రీకోర్టు జడ్జీల సంఖ్యను చట్టం ద్వారా పార్లమెంటే నిర్ణయించవచ్చు. దీనికోసం సాధారణ మెజారిటీ ఉంటే చాలు. ఇతర రాజ్యాంగ సవరణ చట్టాలలాగా మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం లేదు. దీంతో ఈ బిల్లు త్వరగానే ఆమోదం పొందే అవకాశం ఉంది. ఇదే జరిగితే ఇప్పుడు సుప్రీంకోర్టుకు 37 మంది జడ్జీలు ఉంటారు. అదనంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా. సీజేఐతో కలిపితే మొత్తం 38 మంది జడ్జీలు అవుతారు.



## పెళ్లయిన మూడు నెలలకే యువకుడి ఆత్మహత్య

**భార్య వేధింపులు తట్టుకోలేక బలవన్మరణం**

**ఖమ్మం, జూలై 20 :** ఖమ్మం జిల్లాలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. మగతనం లేదని నిత్యం భార్య వేధింపులు తట్టుకోలేక ఓ భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెళ్లయిన మూడు నెలలకే యువకుడు బలవన్మరణానికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. రఘునాథపాలెం మండలం రాంక్యాతండాకు చెందిన సదర్‌లాల్ (27) తండ్రితో కలిసి మేకల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఏడాది మే నెలలో హర్యాతండాకు చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. అయితే పెళ్లయిన మూడో రోజు నుంచే నీకు మగతనం లేదంటూ భార్య అవమానించడం, మానసికంగా వేధించడం మొదలుపెట్టింది. ఇటీవల సీత్లా పండుగ సందర్భంగా అత్తారింటికి వెళ్తే.. అక్కడ తన కుటుంబసభ్యులతో కలిసి మరోసారి సదర్‌లాల్‌ను భార్య అవమానించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు ఇంటికొచ్చి బాధపడ్డాడు. తర్వాత అక్క దగ్గరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి.. బయటకు వెళ్లి చనిపోతున్నానని బావకు ఫోన్ చేసి చెప్పాడు. అలాగే అతని లొకేషన్‌ను షేర్ చేశాడు. కంగారు పడిన కుటుంబసభ్యులు వెంటనే వి.వెంకటాయపాలెం కాల్వ దగ్గరకు వెళ్లి చూడగా.. అక్కడ సదర్‌లాల్ బైక్, ఫోన్, కలుపు మందు డబ్బా కనిపించాయి. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కాల్వలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. అయితే పెళ్లికి ముందే సదరు యువతి మరో వ్యక్తితో ప్రేమలో ఉందని.. పెళ్లయ్యాక కూడా అతనితో సంబంధం కొనసాగించేందుకే సదర్‌లాల్‌కు మగతనం లేదని ఆరోపణలు చేసిందని కుటుంబసభ్యులు ఆరోపించారు. యువతి ఆరోపణలతో పంచాయతీ పెడితే.. మెడికల్ టెస్టులు చేయించామని వారు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ప్రజాగొంతుకపై అంకుశం!



**దేశంలో ఆందోళనలను పట్టించుకునేందుకు పాలకులకు తీరిక లేకుండా పోయింది. కేంద్రంలోని ప్రభుత్వమైనా, రాష్ట్రాల్లోని వివిధ పార్టీల నేతృత్వంలో ఉన్న ప్రభుత్వాలకైనా ఇది కనపడడం లేదు. అన్నా హజారే లాంటి వారు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే స్థితిలతో పాలకులు లేరు. రాజకీయ అవినీతిపై ఆయన యుద్ధం చేస్తున్నా, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఇరవైరోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆమరణ దీక్షలో ఉన్నారు. ఆయన ఎందుకు దీక్ష చేస్తున్నారు..ఎందుకు నిరసనలకు దిగారన్న కనీస ఆలోచన కూడా చేసే పరిస్థితిలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం లేదు.**

ఎన్‌డిఎకు మద్దతు ఇస్తున్న పార్టీలు కూడా కిమ్మనడం లేదు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలో పనికిరాదు. మొత్తంగా పోటీ పరీక్షల విశ్వసనీయత దెబ్బతినివున్న పరిస్థితుల్లో ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్న సంస్కరణలపై మాట్లాడటా నికీ, తగిన చర్యలు చేపట్టడానికీ ప్రభుత్వానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. ప్రజల పక్షాన నిరశనలు, ఉద్యమాలు చేయడం వాంగ్‌చుక్‌కు కొత్తకాదు. రేపోమాపో ఆయన దీక్ష విరమించినా ఎవరూ దానిని వైఫల్యంగా భావించరు. కానీ, నెలన్నరనుంచి సాగుతున్న ఈ ఉద్యమాన్ని బేఖాతరు చేయడం ప్రభుత్వానికి అప్రదిష్ఠతెస్తుంది, మానవత్వం, జవాబుదారీతనం కొరవడ్డాయన్న అభిప్రాయానికి తావిస్తుంది. శాంతియు తంగా సాగుతున్న నిరసనను అలాగే ముగిసేట్టు చూడాల్సిన బాధ్యత ఇరుపక్షాలపైనా ఉంది. కొందరు నిస్వార్థ పరులు దేశం కోసం ఏదో చేయాలన్న తపనలో ఉంటారు. వారు తమ ఆకాంక్షను నిరసలన ద్వారా తెలియచేస్తారు. వాటిని గుర్తించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. తాజాగా సోనమ్ వాంగ్ చుక్ దీక్ష ఈ కోవలోకే వస్తుంది. నీట్ తప్పిదాలకు బాధ్యత వహిస్తూ కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో వాంగ్‌చరక్ దీక్షకు దిగారు. నిజానికి సోనమ్ ను పిలిచి మాట్లాడవచ్చు. లూఏదా ఆయన దీక్షను విరమించేలా, ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించ వచ్చు. కానీ ప్రభుత్వం అలా చేయకుండా యాన దీక్ష భగ్నానికి యత్నించింది. అంటే దీక్షలను కూడా తట్టుకునే స్థితిలో పాలకులు లేరని గుర్తించాలి. 1984లో లద్దాఖ్ వాసులకు ఎస్టీ హోదా ఇవ్వాలంటూ వాంగ్‌చుక్ తండ్రి వాంగ్యాల్ ఇలాగే దీక్షకు దిగితే నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్వయంగా లెహ్ వెళ్ళి, డిమాండ్లు నెరవేరుస్తానని హామీ ఇచ్చి దీక్ష విరమింపచేసిన విషయం మరచిపోరాదు. 2011లో సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే దీక్ష సందర్భంలోనూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ మానవతా దృక్పథంతో వ్యవహరించారు. అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ చర్చించడం ద్వారా పెద్దమనసు చాటుకున్నారు.

వాంగ్‌చుక్ ఈ దీక్షకు దిగడానికి బీజేపీమీద ఆయనకు ఉన్న పాతకక్షలే కారణమంటూ కొన్ని హిందీ చానెళ్ళలోనూ, సోషల్ మీడియాలోనూ బురదజల్లే పని జోరుగా సాగడం దారుణం కాక మరోటి కాదు. ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని, పదికేజీలకు పైగా బరువు తగ్గారని, దీక్షసాగితే కీలక అవయవాల పై దుష్ప్రభావాలు తప్పవని వైద్యబృందం హెచ్చరించడంతో పోలీసులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఈ పనిచేసే ముందు వాంగ్‌చుక్‌తో మాట్లాడివుంటే పాలక పార్టీ పెద్దల గౌరవం తగ్గేది ఏమీ లేదు.. ఆయన ప్రాణానికి ప్రమాదం ఉన్నది కనుక, దీక్ష విరమింపచేయా లంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేస్తూ, ప్రతీ పౌరుడి ప్రాణమూ విలువైనదేనని, వాంగ్‌చుక్‌కు ప్రభుత్వ వైద్యులతో నిరంతర పరీక్షలు నిర్వహిస్తూ, వైద్యపరమైన చర్యలన్నీ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. ఆయనతోపాటుగా ఆమరణదీక్షలో ఉన్న ముగ్గురు విద్యార్థినేతల ఆరోగ్యం బాగా దిగజారిందని, తక్షణమే దీక్షవిరమించాల్సిందిగా ఒకరిని వైద్యులు హెచ్చరించినట్టుగా వార్తలు వస్తున్నాయి. వాంగ్‌చుక్ మాత్రం తాను బయటకు బలహీనంగా కనిపిస్తున్నా, లోన గట్టిగానే ఉన్నానని హామీ ఇస్తున్నారు. తనను దీక్ష విరమించుకోవాలని ఒత్తిడి చేయవద్దని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని వాంగ్‌చుక్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా, పార్లమెంట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభిం అయినా, ఎన్‌డిఎ పక్షనేతలు ఎవ్వరు కూడా వాంగ్‌చుక్‌ను పలకరించలేదు. ఆయన పక్షాన నిలవడానికి వారికి ధైర్యం లేకుండాపోయింది. దీక్షాస్థలిని సందర్శించి మద్దతు ప్రకటిస్తున్న ప్రముఖులు, నేతలు లేకపోలేదు. కొందరు స్వయంగా వచ్చి సంఘీభావం ప్రకటిస్తే, బీజేపీ ప్రభుత్వ కఠినవైఖరిని పలు వేదికలద్వారా మరికొందరు ప్రశ్నిస్తున్నారు.

నీట్ వైఫల్యం మీద స్వయంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ, ధర్మేందప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ, కాస్తంత ఆలస్యంగానైనా వాంగ్‌చుక్ పక్షాన మాట్లాడుతోంది. ఇకపోతే లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, ఆరో షెడ్యూల్ రక్షణల కోసం గత ఏడాది వాంగ్‌చుక్ సుదీర్ఘపోరాటం చేసినప్పుడు కూడా ప్రభుత్వం ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా, హింసను ప్రేరేపించారన్న ఆరోపణలతో, ఆయన మీద జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించి, జైల్లో పడేశారు. 170 రోజులు జైల్లో ఉన్నాక, సుప్రీంకోర్టులో కేసు చివరివిడత విచారణకు రెండురోజుల ముందు ప్రభుత్వం ఆయనను విడుదలచేసింది. దానితోపాటు, ఆయనను అరెస్టుచేయడానికి ప్రాతిపదికలుగా వాడిన పాకిస్థాన్‌తో సంబంధాలు, అనుమానస్పద విదేశీపర్యటనలు, అక్రమ విరాళాల సేకరణ ఇత్యాది ఆరోపణలను కూడా గాలికి వదిలేసింది. ఓ రకంగా ప్రజల గొంతుకపై పాలకులు అంకుశం దింపుతున్నారు. తాముకోరుకున్నట్లుగా పాలన సాగిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించడం లేదు. ఇందుకు తాజా ఘటనలే నిదర్శనం.

# ఉద్రిక్తంగా చలో పార్లమెంట్ పిలుపు

- సిజెపి కార్యకర్తల రాకతో పార్లమెంట్ వద్ద ఉద్రిక్త
- పోలీస్ బారికేడ్లను దాటుకుని వచ్చిన వేలదిమంది
- ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసుల లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం



**న్యూఢిల్లీ, జూలై 20:** దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నీట్–యూజీ పరీక్షల అక్రమాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన 'చలో పార్లమెంట్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సీజేపీ మద్దతు దారులు బారికేడ్లను తోసుకొని పార్లమెంట్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నిం చారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు, మద్దతుదారులు జంతర్ మంతర్ వద్దకు భారీగా చేరుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు కూడా హాజరయ్యారు. దీంతో ఆ ప్రాంతంలో భద్రతా దళాలు పెద్దఎత్తున మోహరించాయి. దీంతో ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రైసినా రోడ్డు మార్గంలో ఈ ఘటన జరిగింది. పార్లమెంట్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో ఆందోళనకారుల్ని పోలీసులు అడ్డుకున్నారు. జంతర్ మంతర్ నుంచి సీజేపీ.. పార్లమెంట్ మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద ఆందోళనకారులపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. సీజేపీ కార్యకర్తలను చెదరగొట్టే ఉద్దేశంతో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. సన్‌సద్ మార్గ్ రోడ్డులో వస్తున్న ఆందోళనకారుల్ని కూడా పోలీసులు అడ్డుకున్నా రు. సన్‌సద్ మార్గ్ పోలీసు స్టేషన్ వద్ద బారికేడ్లు పెట్టి నిరసన కారుల్ని ముందుకు కదలకుండా చేశారు. అయినా తోసుకుని రావడంతో భద్రతా బలగాలు లాఠీఛార్జ్ చేశాయి. ఆ ఘర్షణలో కొందరు ఆందోళనకారులు గాయపడ్డారు. సైట్ వద్దే వారికి ప్రథమ చికిత్స అందించారు. వికాస్ మార్గ్‌లోని ఐటీవో వద్ద కూ డా నిరసనకారులను బ్లాక్ చేశారు. ఐటీవో, సెంట్రల్ ఢిల్లీ రూట్లో ఇది కీలకమైన ప్రదేశం. పార్లమెంట్, జంతర్ మంతర్ ఈ మార్గంలోనే ఉన్నాయి. పార్లమెంట్ స్ట్రీట్ వద్ద వేల సంఖ్యలో సీజేపీ కార్యకర్తలు చేరుకున్నారు. వారిపై లాఠీఛార్జ్ జరిగినట్లు తెలుస్తోం ది. బారికేడ్లను తొలగించేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. పోలీసులకు, సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. సుమారు 15 మంది ఆందోళనకారు లను అదుపులోకి తీసుకు న్నారు. ర్యాలీ ప్రారంభమైన వెంటనే నిరసనకారులను భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా భద్రతా సిబ్బంది, సీజేపీ కార్య కర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో వారిని చెదరగొట్టేందుకు భద్రతా దళాలు లాఠీఛార్జ్ చేశాయి. పలువురిని అరెస్టు చేశారు. మరోవైపు, ఇప్పటికే పార్లమెంట్‌కు వెళ్లే అన్ని మార్గాలను అధికారులు మూసి వేశారు. జంతర్ మంతర్‌తో పాటు పటేల్ చౌక్, పార్లమెంట్ స్ట్రీట్, రైల్ భవన్ ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నా రు. ముందస్తు చర్యల్లో భాగంగా ఐదు మెట్రో స్టేషన్లను కూడా మూసివేశారు. అలాగే సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున తలపెట్టిన ఈ మార్చ్‌కు పోలీసులు అనుమతి నిరాకరించారు.

ఎక్కడికక్కడ విద్యార్థులను అడ్డుకొనేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినప్పటికీ.. భారీ సంఖ్యలో నిరసనకారులు బారికేడ్లను దాటుకొని పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. దాంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. భాష్పవాయువు గోళాలను ప్రయో గించారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆ ప్రాం తమంతా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పలువురు పోలీసులకు గాయాలైనట్లు సమాచారం.

# అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ

## సిజెపిని చర్చలకు పిలిచిన జెపి నడ్డా

**న్యూఢిల్లీ, జూలై 20:** సిజెపి కార్యకర్తల చలో పార్లమెంట్ పిలుపుతో ఢిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్లమెంట్ భవనం లోపల వీరి భేటీ జరిగినట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. 'చలో పార్లమెంట్' వేళ ఈ నిరసనలనకు నాయకత్వం వహిస్తున్న నాయకులతో కేంద్రమంత్రి జేపీ నడ్డా భేటీ అయ్యారు. అలాగే ధర్మేంద్ర ప్రధాన్ కూడా వారితో మాట్లాడుతున్నారు. మరోవైపు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జేపీ నడ్డా కలవనున్నారని సమాచారం. పరీక్షల నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చిందని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సోమవారం ప్రకటించింది. తమ డిమాండ్లను వివరించేందుకు ఇద్దరు అధికార ప్రతినిధులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ కానున్నట్లు సీజేపీ వెల్లడించింది. అయితే.. ఈ చర్చల అంశంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇదిలా ఉండగా.. పరీక్షల అవకతవకలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది సీజేపీ కార్యకర్తలు, నిరసనకారులు ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపునకు ర్యాలీగా వెళ్లేందుకు యత్నించగా భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు.

ఈ నేపథ్యంలో పోలీస్ బలగాలు, సీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకోగా.. పలువురు పోలీసులు, సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. దీంతో టియర్ గ్యాస్ ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు పోలీసులు. ఈ క్రమంలో పార్లమెంట్ పరిసర ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల మధ్య సీజేపీ ప్రతినిధులు.. జేపీ నడ్డాతో భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. చర్చల అనంతరం పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశమున్నట్టు తెలుస్తోంది.



# అభిజిత్ దీప్కే అరెస్ట్ వార్తలు

## పుకార్లను నమ్మవద్దని ఢిల్లీ పోలీసుల వెల్లడి

**న్యూఢిల్లీ, జూలై 20:** కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) అధ్యక్షుడు అభిజిత్ దీప్కేను అరెస్ట్ చేశారంటూ వస్తున్న వార్తలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, అసత్య ప్రచారాలను నమ్మ వద్దని ప్రజలకు వారు స్పష్టం చేశారు. అభిజిత్ దీప్కే.. జంతర్ మంతర్ ధర్నా పాయింట్ వద్ద ఉన్నారని ఢిల్లీ పోలీసులు వివరించారు. అభిజిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడం కానీ.. అరెస్ట్ చేయడం కానీ జరగలేదని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలోని లోపాల నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది. ఈ నేపథ్యంలో సోమవారం చలో పార్లమెంట్‌కు ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఈ యాత్రకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఈ యాత్రలో భారీగా యువత పాల్గొంది. ఈ యాత్రను అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ భారీగా ఏర్పాట్లు చేశారు. అయినా నిరసనకారులు భారీ సంఖ్యలో పార్లమెంట్ వైపునకు దూసుకెళ్లారు. వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. భాష్పవాయుగోళాలు ప్రయోగించారు. దీంతో నిరసనకార్లు.. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇంకోవైపు ఈ యాత్రలో పాల్గొన్న సోనమ్ వాంగ్ చుక్ భార్య గీతాంజలి జుట్టు పట్టుకుని ఢిల్లీ పోలీసులు లాగారు. దీంతో గీతాంజలిపై పోలీసులు దాడి చేశారంటూ సీజేపీ ఆరోపించింది. ఈ ర్యాలీలో పాల్గొన్న 12 ఏళ్ల బాలికపై పోలీసులు దాడి చేశారని.. దీంతో ఆమె తల పగిలిందని వివరించింది. మరో 40 నుంచి 50 మంది సీజేపీ కార్యకర్తల తలలు పగిలిపోయాయని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. సోమవారం నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. దీంతో పార్లమెంట్, జంతర్ మంతర్‌తోపాటు ఢిల్లీలోని వివిధ ముఖ్య ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. జూన్ 28వ తేదీ నుంచి నిరాహార దీక్ష చేపట్టిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శనివారం బలవంతంగా సఫ్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు. కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన చలో పార్లమెంట్ యాత్రకు ఆయన మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే.

# దీక్ష విరమించినట్లు దీప్కే ప్రకటన

## సోనమ్ విజ్ఞప్తితో దీక్ష విరమించిన సిజెపి నేత

**న్యూఢిల్లీ, జూలై 20 :** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన ఆమరణ దీక్షను విరమించారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అభ్యర్థన మేరకు దీప్కే తన దీక్షను విరమించినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ మార్చ్ చేస్తున్న వారికి సంఘీభావంగా దీక్షను విరమించాలని వాంగ్‌చుక్ కోరారు. డెహ్రాడూన్‌కు చెందిన నీట్ అభ్యర్థి రాయ్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె తండ్రితో కలిసి దీప్కే దీక్షను విరమించారు. ప్రస్తుతం సఫ్దార్‌జంగ్ ఆస్పత్రిలో వాంగ్‌చుక్ చికిత్స పొందుతున్నారు. జంతర్ మంతర్ వద్ద ఆయన దీక్షను పోలీసులు భగ్నం చేసి ఆస్పత్రికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. వాంగ్‌చుక్‌ను తరలించిన తర్వాత .. అభిజీత్ దీప్కే ఆమరణ దీక్షకు పూనుకున్నారు. మరో వైపు పార్లమెంట్‌లో విద్యార్థుల ఆందోళన పై రచ్చ కొనసాగుతోంది. ఇవాళ ప్రారంభమైన ఉభయసభల్లోనూ విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజీ అంశంపై చర్చ చేయాలని డిమాండ్ చేశాయి. దీంతో ఇప్పటికే పలుమార్లు లోక్‌సభ, రాజ్యసభలు వాయిదా పడ్డాయి. విద్యార్థుల గొంతును ప్రభుత్వం నొక్కేస్తోందని రాజ్యసభలో ఖర్గే ఆరోపించారు. పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొనేందుకు తనకు అవకాశం ఇవ్వాలని వాంగ్‌చుక్ కోరారు. ఆస్పత్రి నుంచి తాత్కాలికంగా డిశ్చార్జ్ చేయాలని కోరినట్లు తెలిసింది.

# పోలీసుల లాఠీలకు బెదరని యువకుడు

## కొట్టండి సర్ అంటూ.. గట్టిగా అరుస్తూ నిరసన



**న్యూఢిల్లీ, జూలై 20 : నీట్‌తో** పాటు జాతీయ ప్రవేశ పరీక్షల్లో అక్రమాలపై పోరాడుతున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి చెందిన నిరసనకారుడు భద్రతా దళాల లాఠీలకు ఏమాత్రం భయపడలేదు, బెదరలేదు. పైగా 'నన్ను కొట్టండి సర్, కొట్టిండి' అని గట్టిగా అరిచాడు. దీంతో భద్రతా సిబ్బంది షాక్ అయ్యారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నీట్ అక్రమాలపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీజేపీ కార్యకర్తలు నిరసన కొనసాగిస్తున్నారు. కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడంతో సీజేపీ కార్యకర్తలు ర్యాలీగా అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పార్లమెంట్ వైపు దూసుకెళ్తున్న వారిని అడ్డుకునేందుకు భద్రతా దళాలు ప్రయత్నించాయి. సీజేపీ కార్యకర్తలను నిలువరించేందుకు లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పాయువు ప్రయోగించారు. ఈ నేపథ్యంలో కొందరు నిరసకారులు అక్కడి నుంచి కాస్త దూరంగా పరుగెత్తారు. అయితే ఒక నిరసకారుడు మాత్రం భద్రతా దళాల లాఠీఛార్జ్‌కు భయపడలేదు. అతడు ఏమాత్రం బెదరలేదు. పైగా లాఠీ దెబ్బలను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాడు. లాఠీలు ఝులిపిస్తున్న భద్రతా సిబ్బందితో 'నన్ను కొట్టండి సర్, కొట్టిండి' అని గట్టిగా అరిచాడు. దీంతో భద్రతా సిబ్బంది షాక్ అయ్యారు. కొంతసేపు అలాగే ఉండిపోయారు. ఇంతలో పక్కనే ఉన్న కొందరు భద్రతా సిబ్బంది జోక్యం చేసుకున్నారు. ఆ నిరసకారుడిని అక్కడి నుంచి వెనక్కి తీసుకెళ్లారు. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో పలువురు రాజకీయ నేతలు, నెటిజన్లు దీనిపై స్పందించారు. 'తమ హక్కులు, ఉపాధి, దేశ రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు యువత ఎప్పుడు వీధుల్లోకి వచ్చినా అణచివేత, భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాలకవర్గం పాల్పడుతుంది. లాఠీలు, బారికేడ్లు, పోలీసుల రక్షణ వెనుక ప్రభుత్వం ఇంకెంతకాలం దాక్కుంటుంది?' అని 'ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ' జాతీయ నాయకుడు ధీరజ్ గుర్జార్ ప్రశ్నించారు.

# ఎబోలా ఎఫెక్ట్.. 930కి పెరిగిన మృతులు




**బునియా:** మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. మే 15 నుంచి శనివారం నాటికి దేశ వ్యాప్తంగా 2,344 కేసులు నమోదు కాగా.. దాదాపు 930 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ఆరోగ్యశాఖ తాజాగా వెల్లడించింది. శుక్రవారం నుంచి 24 గంటల వ్యవధిలో 37 మరణాలు నమోదైనట్లు తెలిపింది. ప్రస్తుతం కాంగోలో నమోదవుతున్న కేసులన్నీ బుండిబుగ్యో ఎబోలా రకానివే. ఈ తరహా కేసులు నమోదవుతున్నట్లు మే 15న అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఈ వైరస్‌ను అరికట్టేందుకు ప్రస్తుతం వ్యాక్సిన్ గానీ, చికిత్స గానీ అందుబాటులో లేవు. సాధారణంగా ఎబోలా వైరస్ జంతువులు, గబ్బిలాలకు సోకుతుంది. అది సోకిన జంతువులను వేటాడి వాటి మాంసం (బుష్‌మీట్) తినడం వల్ల మనుషులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించడానికి 21 రోజులు పడుతుంది. ఫ్లూ, మలేరియా, జ్వరం వంటి లక్షణాలు తొలుత కనిపించినా.. చివరకు అవయవాల వైఫల్యానికి దారితీసే ప్రమాదం ఉంది. మామూలుగా ఎబోలా వైరస్ జంతువులు, గబ్బిలాలకు సోకుతుంది. ఆ వైరస్ సోకిన జంతువులను వేటాడి (బుష్‌మీట్) తినడం వల్ల మనుషులకు చేరుతుంది. వ్యాధి లక్షణాలు కనిపించడానికి 21 రోజులు పడుతుంది. ఫ్లూ, మలేరియా, జ్వరం వంటి లక్షణాలు తొలుత కనిపించినా.. చివరకు అవయవాల వైఫల్యానికి దారితీయొచ్చు. కొన్ని కేసుల్లో శరీరం లోపలా, బయటా రక్తస్రావం అవుతుంటుంది. వైరస్ సోకిన వ్యక్తి శరీర ద్రవాల ద్వారా ఇది ఇతరులకూ వ్యాపిస్తుంది.

# రోడ్డు దాటుతుండగా ఢీకొన్న ఆటో

## వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం

**హైదరాబాద్, జూలై 20 :** నగరంలోని కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. హైదర్‌నగర్ వద్ద రోడ్ క్రాస్ చేస్తుండగా ఆటో ఢీ కొట్టడంతో నర్సింహ(60) అనే వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి వీడియో సీసీటీవీ కెమెరాలో రికార్ట్ అయ్యింది. మృతుడు జహీరాబాద్‌లోని శిశుమందిర్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేసి రిటైర్ అయినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లో ఉంటూ జహీరాబాద్‌లో ఇల్లు కన్‌స్ట్రక్షన్ చేయిస్తున్నాడు. ఈ క్రమంలో ఈరోజు(సోమవారం) జహీరాబాద్ వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన ఆటో.. నర్సింహను బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన స్పాట్‌లోనే మృతిచెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నర్సింహ మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు.



## ఘనంగా ఎండి.అజాం జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన అనిల్ కుమార్ యాదవ్

**శేరిలింగంపల్లి, జులై 20 (జనంవార్త) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మసీద్‌బండలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి జనరల్ సెక్రటరీ ఎమ్.డి. అజాం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ ఎమ్.డి.అజాం కు శాల్వాను కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం కేకును కటింగ్ చేయించి,పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి అంకితభావంతో,నిస్వార్థ సేవా దృక్పథంతో పనిచేస్తున్న ఎమ్.డి. అజాం భవిష్యత్తులో మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్, మారబోయిన మహేష్ యాదవ్,ఇమ్రాన్,డేవిడ్, ఆకాష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ప్రజావాణికి 84 ఫిర్యాదులు

**మేడ్చల్ :** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జూలై 20న జిల్లా కలెక్టర్ మను చౌదరి జిల్లా రెవెన్యూ అధికారి మాలతితో కలిసి జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 84 మంది అర్జీలు దాఖలు చేసుకున్నారు. అనంతరం కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సర్‌ను విజయవంతం చేయాలి

### డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్

### మేడ్చల్ నియోజకవర్గంలో కో-ఆర్డినేటర్ల నియామకం

**మేడ్చల్ :** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని జిల్లా డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఈ మేరకు సర్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు డివిజన్, మున్సిపాలిటీ వారీగా కో – ఆర్డినేటర్లను నియమించారు. అనంతరం పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, నియమితులైన కో– ఆర్డినేటర్లు తక్షణమే బాధ్యత లు స్వీకరించి, సంబంధిత డివిజన్, మున్సిపాలిటీ పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బి.ఎల్.వో లు, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు.



## దళిత-గిరిజన గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు

**కారేపల్లి :** సింగరేణి మండలంలోని దళిత, గిరిజన ఆవాస ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, ఎస్సీ--ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం కేటాయించిన నిధులను తక్షణమే విడుదల చేసి ఆయా ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి మండలంలోని దళిత, గిరిజన ఆవాస ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో పలు కీలక సమస్యలు వెలుగులోకి వచ్చాయని ఆయన తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, గృహాలు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందన్నారు. భూమిలేని వ్యవసాయ కార్మికులు ఉపాధి హామీ చట్టంలో మార్పుల కారణంగా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత, గిరిజన ఆవాస ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ఎస్సీ–ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఎలాంటి జాప్యం లేకుండా విడుదల చేసి, వాటిని పూర్తిగా దళిత, గిరిజన ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీల సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతోదయ అన్నపూర్ణ కార్డుల ద్వారా 35 కిలోల బియ్యం పొందుతున్న పేద దళిత, గిరిజన కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం కార్డులను రద్దు చేసే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసిన లబ్ధిదారులకు ఇప్పటికీ చివరి బిల్లులు చెల్లించలేదని, అలాగే కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద విడుదల చేయాల్సిన రూ.60 వేల ప్రోత్సాహకాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజనులకు రూ.6 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన ప్రతి కుటుంబానికి రాజకీయ పక్షపాతం లేకుండా మంజూరు చేయాలని కోరారు.

# దేవాదాయ శాఖలో డిజిటలీకరణ

### మంత్రి కొండా సురేఖ వెల్లడి



**హైదరాబాద్,జులై 20 :** దేవాదాయ శాఖ పరిధిలోని పరిపాలనను పూర్తిస్థాయిలో డిజిటలీకరణెళి ప్రభుత్వ లక్ష్యమని ఆ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. సోమవారం హైదరాబా ద్‌లో తెలంగాణ ధార్మిక సంస్థలు, దేవాలయాల చట్టం – 2025 డ్రాఫ్ట్‌పై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. దేవాదాయ శాఖలో డిజిటల్ సంస్కరణలకు దిశానిర్దేశర చేశారు. ఎండోమెంట్ వ్యవస్థకు మరిన్ని మెరుగులు దిద్దాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. భక్తులకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. దీనిపై అధికారుల ప్రజెంటేషన్‌కు మంత్రి కీలక సూచనలు చేశారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు డ్రాఫ్ట్ రూల్స్‌పై సుదీర్ఘంగా సమీక్షించారు. ట్రస్ట్ బోర్డు పనితీరు పారదర్శకంగా ఉండేలా నియమావళి రూపొందించాలని సూచించారు. దేవ స్థానాల పరిపాలనను మరింత బలోపేతం చేయాలని అధికా రులకు వివరించారు. యాదగిరిగుట్ట – వేములవాడ దేవాల యాల్లోని సిబ్బంది పరస్పర బదిలీలపై మంత్రి సురేఖకు ఈ సందర్భంగా ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంతోపాటు వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొండా సురేఖ వివరించారు.

## పెరిగిన ధరలకనుగుణంగా మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి

- కార్మిక యూనియన్ డిమాండ్
- డీఈఓకు వినతిపత్రం
- ఎలక్షన్ మేనిఫెస్టో ప్రకారం రూ.18 వేల వేతనం అమలు చేయాలి



**మేడ్చల్ :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు పెరిగిన మార్కెట్ ధరలకు అనుగుణంగా గుడ్లు, కూరగాయల బిల్లులు వెంటనే పెంచి ఇవ్వాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం ఈ మేరకు జిల్లా విద్యాశాఖ ఏడీ లింగా నందం ను కలిసి వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కే. ఉన్నికృష్ణన్, జిల్లా కార్యదర్శి ప్రేమలతలు మీడియాతో మాట్లా డుతూ, ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో గుడ్లు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం కేటాయిస్తున్న ధర కంటే మార్కెట్‌లో ఒక్కో గుడ్డుపై మూడేసి రూపాయలు అదనంగా చెల్లించాల్సి వస్తోందని, ఈ భారాన్ని కార్మికులే మోయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్కూళ్లకు అవసరమైన గుడ్లు, కూరగాయలు, వంట గ్యాస్ సరఫరా బాధ్యతను ప్రభుత్వమే నేరుగా చేపట్టాలని కూడా వారు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.18,000 వేతనం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా కార్మికుల వేతనాలు పెంచకపోవడం, ఉన్న వేతనం కూడా సకాలంలో ఇవ్వకపోవడం దారుణమన్నారు. స్కూళ్లకు గుడ్లు, కూరగాయలు, వంట గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలన్నారు. వంట చేసే సమయంలో ప్రమాదాలకు గురవుతున్న కార్మికులకు ఉచిత ప్రమాద ఇన్సూరెన్స్ వర్తింపజేయాలి, యూనిఫాంలు అందించాలన్నారు. మధ్యాహ్న భోజన సిబ్బందిని పూర్తిస్థాయి కార్మికులుగా గుర్తించి ఈ,ఎస్.ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు.. ఇల్లు లేని నిరుపేద మధ్యాహ్న భోజన కార్మికులందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్ళు కేటాయించాలన్నారు.

## కోర్టు ఉత్తర్వులున్నా అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?

### అధికారుల నిర్లక్ష్యంపై జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు

**మేడ్చల్ :** న్యాయస్థానం పనులు నిలిపివేసి, అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, స్థానిక అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ)కి లేఖ ద్వార ఫిర్యాదు చేశారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపేట గ్రామంలో గల సర్వే నెంబర్ 70 మరియు 71 లలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా “అరుణ గోదాం” యజమాన్యం కోల్డ్ స్టోరేజ్ పరిశ్రమను నిర్మిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకపోవడం వల్ల ప్రభుత్వానికి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోందని, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు.

**లోకాయుక్తను ఆశ్రయించినా ఫలించని ఉత్తర్వులు :**

స్థానిక అధికారులు స్పందించకపోవడంతో బాధితుడు లోకాయుక్త / ఉపలోకాయుక్త న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పిర్యాదును పరిశీలించిన న్యాయస్థానం, సర్వే నెంబర్ 70, 71లలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, అనధికార నిర్మాణాలను తొలగించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధికారులను ఆదేశించింది.

**అధికారుల తీరుపై అనుమానాలు :**

కోర్టు ఉత్తర్వుల ప్రతిని మే 30, 2026న మున్సిపల్ కమిషనర్‌కు, అలాగే జూన్ 01, 2026న జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో సమర్పించినట్లు లేఖలో పేర్కొంది. అయినా సంబంధిత యజమానులు రాత్రింబవళ్లు పనులు కొనసాగి స్తున్నారని, వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం చూస్తుంటే అక్రమ నిర్మాణదారులతో అధికారులు కుమ్మక్కయ్యారనే అనుమానాలు వ్యక్తమవుతు న్నాయని లేఖలో ఆరోపించారు.

**ఉత్తర్వులు అమలు చేయాలని వినతి :**

అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకుని, గౌరవ లోకాయుక్త న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం అమలు జరిగేలా చూడాలని ఎల్లంపేట గ్రామానికి చెందిన తలారి చందర్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను వేడుకున్నారు.

## మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ యువమోర్చా అధ్యక్షుడిగా రాగం అర్జున్

### పార్టీని బలోపేతం చేసి మేడ్చల్‌లో జెండా పాతడమే లక్ష్యం : రాగం అర్జున్



**మేడ్చల్ :** భారతీయ జనతా పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా యువమోర్చా అధ్యక్షుడిగా రాగం అర్జున్ నియమితుల య్యారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ రాష్ట్ర అధినాయకత్వానికి, జిల్లా నేతలకు ఆయన ఈ సందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కొండే, మేడ్చల్ జిల్లా మాజీ బీజేపీ అధ్యక్షుడు పి. విక్రమ్ రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ పటేల్, అలాగే మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ కు రాగం అర్జున్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**పార్టీ బలోపేతానికి నిరంతర కృషి : రాగం అర్జున్**

నాపై ఎంతో నమ్మకంతో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ యువ మోర్చా బాధ్యతలను అప్పగించా రు. మనసా, వాచా, కర్మణా తూ చా తప్పకుండా పెద్దల సలహాలు, సూచనలతో ముందుకు సాగుతా ను. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా, మేడ్చల్ జిల్లాలో కూడా బీజేపీ పార్టీని అధికారంలోకి తీసుకురావ డమే ధ్యేయంగా అడుగులు వేస్తా ను. దైవసాక్షిగా ప్రమాణం చేస్తూ, పార్టీ ఎదుగుదల కోసం శ్రమి స్తానని తెలియజేస్తున్నానని తెలిపా రు. దీంతో యువమోర్చా అధ్యక్షుడిగా రాగం అర్జున్ నియామకం పట్ల బీజేపీ శ్రేణులు, యువత తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మేడ్చల్ జిల్లాలో యువమోర్చా ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.



## కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయండి

### ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 23న కలెక్టర్ ఆఫీసుల ముట్టడి

### ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**హైదరాబాద్ :** విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న జరిగే కలెక్టర్ ఆఫీసుల ముట్టడిని జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదివేల ఐదు వందల కోట్లు ఫీజుల బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశా రు. విద్యార్థులకు ఫీజులు ఇవ్వకపోవడం వలన చదువులు పూర్తి అయిన ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, న్యాయ కళాశాల విద్యార్థులకు ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులకి గురిచేస్తున్నాయని వాపోయారు. విద్యార్థుల ఇబ్బందులను గమనించి రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 23న జరిగే కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థులపై టియర్ గ్యాస్, లాఠీచార్జి దారుణం

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి : పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వి. రాకేష్



**కారేపల్లి :** ఢిల్లీలో శాంతియుతంగా “ఛలో పార్లమెంట్” కార్యక్రమానికి వెళ్తున్న విద్యార్థులు, యువతపై ఢిల్లీ పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నట్లు ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వి. రాకేష్ పేర్కొన్నా రు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేం ద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనా మా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ కారణంగా నష్టపోయిన విద్యా ర్థులకు తక్షణమే న్యాయం చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరా రు. విద్యార్థులు గత కొన్ని రోజులుగా ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేస్తున్న ప్పటికీ కేంద్ర ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షపై ప్రభుత్వం స్పందించకుండా, చర్చలకు ముందుకు రాకుండా పోలీసు బలగాలతో దీక్షను భంగపరచడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని రాకేష్ అన్నారు. దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలపై స్పందించాల్సిన ప్రభుత్వం నిరసనలను అణచివేసే చర్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించిన ఆయన, విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధానాలు అవలంబిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం, ప్రజాస్వామ్య గొంతుకలను అణచివేయడం సరికాదన్నారు. నీట్ పేపర్ లీక్‌తో నష్టపోయిన ప్రతి విద్యార్థికి న్యాయం జరిగే వరకు ఉద్యమాలు కొనసాగుతాయని స్పష్టం చేసిన రాకేష్, ఢిల్లీలో విద్యార్థులు, యువతపై టియర్ గ్యాస్ ప్రయోగించి లాఠీచార్జి చేయడాన్ని విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామ్య వాదులు, ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.



## మల్లాపూర్ యుపిహెచ్సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

**మేడ్చల్ :** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా: కె. ఆనంద్ సోమవారం జులై 20న మల్లాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్య కిట్ల పంపిణీ వాటి పనితీరును పరిశీలించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. నమోదైన క్షయవ్యాధి రోగులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయానికి సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియలను ధృవీకరించారు. రోగుల వివరాలు సకాలంలో నమోదు చేసి, డిబిటి ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. అలాగే, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ కార్యక్రమం పనితీరు తక్కువగా ఉండటంపై ఆరా తీసి, స్క్రీనింగ్ లక్ష్యాలను పెంచి కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రంలోని ఐఎల్ఆర్‌ను తనిఖీ చేసి, వ్యాక్సిన్ల నిల్వ, ఉష్ణోగ్రత నిర్వహణ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. వ్యాక్సిన్ కోల్డ్ చైన్ నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నాణ్యతను పెంపొందించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని డాక్టర్: కె. ఆనంద్ సూచించారు.

జనం వార్త



# హంద్రీనీవాపై వైసిపి నేతల రాజకీయం

**కాలువలపై మొసలి కన్నీరు కార్చొద్దు**

**మాజీ మంత్రి పరిటాల సునీత హెచ్చరిక**


**శ్రీ సత్యసాయి జిల్లా, జూలై 20 :** సూపర్ ఎల్‌నినో కాలంలో కూడా చాలా చోట్ల నీటి సమస్యలు ఉన్నా.. చెరువులలో నిండుగా నీరు పెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిది అని మాజీమంత్రి పరిటాల సునీత అన్నారు. గత ప్రభుత్వంలో గంప మట్టి కూడా ఎత్తివేయని వైసీపీ నాయకులు.. హంద్రీనీవా గురించి మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. హంద్రీనీవా ప్రాజెక్టు పొడవునా ఉన్న చెరువులను ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పరిశీలించారు. హంద్రీనీవా ప్రాజెక్టు పరిరక్షణ పేరుతో ఆదివారం ఆ కాలువను వైసీపీ నేతల బృందం పరిశీలించిన విషయం తెలిసిందే. హంద్రీనీవా కాలువల పరిశీలన పేరుతో వైసీపీ నేతల బృందం పర్యటనపై టీడీపీ నేతలు మండిపడు తున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. హంద్రీనీవా లైనింగ్ పనులలో ఎక్కడ నాసిరకం పనులు జరిగాయని, ఏ కాంట్రాక్టర్ చేశాడో చెప్పండని నిలదీశారు. నాసిరకం పనులు చూపితే అదే కాంట్రాక్టర్‌తో పనులను సరిచేయిస్తాం. క్షేత్రస్థాయిలో వైసీపీ నాయకులు నీటితో నిండిన చెరువులను చూసి ఆత్మవిమర్శ చేసుకోండని అంటూ ఎమ్మెల్యే హితవు పలికారు. వైసీపీలో రాజకీయ అనుభవం ఉన్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి లాంటి నేతలు.. కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ప్రశంసిస్తున్నారని తెలిపారు. వైసీపీ.. పార్టీ మనుగడ కోసం పొరుగు జిల్లాల నుంచి నేతలను పిలిపించుకొని కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు.



# కష్టపడితే పేదరికాన్ని జయించవచ్చు

**తన జీవితమే అందుకు ఉదాహరణ : మంత్రి నారాయణ**

**నెల్లూరు, జూలై 20 :** చదువుతో పేదరికాన్ని జయించవచ్చని ఏపీ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. తాను ట్యూషన్స్ ప్రారంభించి కష్టపడి ఈ స్థాయికి వచ్చానని పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో షైనింగ్ స్టార్ అవార్డ్స్ – 2026లో మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అవార్డులు, మెడల్స్, నగదు, బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే లక్ష్యాన్ని చేరుకోగలరని సూచించారు. యువనేత నారా లోకేశ్ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారని ఉద్ఘాటించారు. విద్యార్థులు ఈ మార్పులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నారాయణ పిలుపునిచ్చారు.తన కష్టంతోనే ఈ స్థాయికి వచ్చానని మంత్రి నారాయణ ప్రస్తావించారు. తాను పదోతరగతి ఫెయిల్ అయ్యానని, ఆ తర్వాత గ్రేస్ మార్కులతో పాస్ అయ్యానని వెల్లడించారు. పదోతరగతి ఫెయిల్ తనలో పట్టుదల పెంచిందని చెప్పుకొచ్చారు. డిగ్రీ మూడేళ్లల్లో యూనివర్శిటీ టాపర్‌గా నిలిచానని తెలిపారు. స్టాటిస్టిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించానని వెల్లడించారు. వీఆర్సీలో పార్టు టైం లెక్చరర్‌గా రూ.40 జీతానికి పనిచేశానని వివరించారు. మూడు నెలలకు గానూ రూ.120 జీతం ఇస్తే తాను తీసుకోలేదని వెల్లడించారు. ప్రభుత్వ అధ్యాపకుడిగా అవకాశం ఇచ్చినా తాను రాజీనామా చేశానని ప్రస్తావించారు.



# సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

**జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ**

**ఏలూరు, జూలై 20 :** ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా స్థాయి అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టరు ఎం.జె. అభిషేక్ గౌడ నిర్వహించారు. జాయింట్ కలెక్టరుతో పాటు అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, డిఆర్వో ఎం. శ్రీదేవి, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఎం. ముక్కంటి లు ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో పిజిఆర్ఎస్ దరఖాస్తులను తప్పనిసరిగా నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించి, పిజిఆర్ఎస్ మరియు రెవెన్యూ క్లినిక్‌లలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోపు నాణ్యమైన విధంగా పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కారాలు ఉండాలని, అర్జీదారులు సంతృప్తి స్థాయిని మరింత పెంచాలని అన్నారు. సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 328 దరఖాస్తులు అందాయని జేసీ అభిషేక్ గౌడ తెలియజేసారు.

# 1న మోడీ చేతుల మీదుగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభం

- నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి ఏర్పాట్లు
- ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు అనిత, శ్రీనివాస్



**విజయనగరం, జూలై 20 :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 1వ తేదీన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తారని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ మేరకు ప్రధాని పర్యటన ఏర్పాట్లను అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అధికారుల కు హోం మంత్రి కీలక సూచనలు చేశారు. ఉత్తరాంధ్ర సంస్కృతి ప్రతిబింబించేలా జానపద కళారూపాలతో స్వాగత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రధాని పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వ యంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు హోం మంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు. గత పదేళ్ల వరకు ఒక సాధారణ గ్రామంగా ఉన్న భోగాపురం ఇప్పుడు రూపురేఖలు మారాయి. విమానాశ్రయం ఏర్పాటుతో నేడు ఉత్తరాంధ్ర ప్రగతికి మణిహారం కాబోతోంది. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన తెదేపా ఈ ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి ప్రతిపాదించింది. అప్పట్లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు చొరవ, ఎన్డీయే ప్రభుత్వం అనుమతితో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అప్పటి వైకాపా ప్రభుత్వం భూసేక రణ చేపట్టింది. 2023 మే 23న ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్ రెడ్డి విమానాశ్రయం నిర్మాణానికి రెండోసారి శంకుస్థాపన చేశారు. సరిగ్గా ఏడాదికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. కేం ద్రంలో పౌరవిమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు బాధ్యతలు చేపట్టడంతో ప్రాజెక్టు నిర్మాణం వేగంగా సాగిం ది. సుమారు రెండున్నరేళ్లలో విమానాశ్రయం నిర్మాణం పూర్తయ్యింది. ఆగస్టు ఒకటిన ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగా ప్రారంభోత్స వానికి ముస్తాబైంది. ఉత్తరాంధ్ర వాసుల సహా రాష్ట్రంలోని నిరుద్యోగుల ఉపాధికి ఈ ప్రాజెక్టు ఊతమివ్వనుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడు లక్షల మందికి ఉపాధి కల్పిస్తుందని కేంద్ర మంత్రి రామ్మో హన్‌నాయుడు వివిధ సందర్భాల్లో పేర్కొన్నారు. పర్యాటక రంగంలోనూ వేలాది ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయి. పారిశ్రామిక, రవాణా రంగాలు భావితరాలకు బంగారు భవిత అందించనున్నాయి. 136 ఎకరాల్లో జీఎంఆర్– మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యు సిటీ విమానాశ్రయానికి అనుబంధంగా ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టును ఏడాదిలోపు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇక్కడ పైలట్లు, రక్షణ రంగ నిపుణులను తీర్చిదిద్దేందుకు అడుగులు పడుతున్నాయి. విమానాశ్రయం సహా ఇతర భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులతో ప్రధానమైన అభివృద్ధి కేంద్రంగా మారనుంది. త్వరలో వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులు, సముద్ర సంపద, ఔషధాల తయారీ ముడిసరకుల ఎగుమతులు.. ఇక్కడకు అవసరమైన సరకుల దిగుమతులతో రాష్ట్ర ప్రధాన పారిశ్రామిక, రవాణా కేంద్రంగా అవతరించనుంది. దేశీయ, అంతర్జా తీయ ప్రయాణికులు, పర్యాటకులతో భారత విమానయాన పరిశ్రమ లో కీలక పాత్ర పోషించనుంది. విమానాశ్రయం చుట్టూ ఒక నగరాన్ని నిర్మించే ప్రతిపాదన ఉంది. ఇందులో పారిశ్రామిక మండలం, విమాన యాన, విద్య, ఆరోగ్య సంరక్షణ మండలాలు నెలకొల్పాలని యోచిస్తు న్నారు. 139 ఎకరాల్లో జీఎంఆర్ టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పలుమార్లు సందర్శించి పనలును స్వయంగా పర్యవేక్షించారు.

# ఆక్వా రంగాన్ని కష్టాల నుంచి గట్టెక్కించండి

**ముగ్గురు కేంద్ర మంత్రులకు వేర్వేరుగా బాబు లేఖలు**

**అమరావతి, జూలై 20 :** ఏపీలో ఆక్వా, రైతు సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈ మేరకు ముగ్గురు కేంద్రమంత్రులకు ఆయన వేర్వేరుగా లేఖలు రాశారు. జన్యుపరంగా మార్పు చేసిన సోయాబీన్ మీల్‌ను దిగుమతి చేసుకునేందుకు రొయ్యల మేత తయారీదారులకు అనుమతి ఇవ్వాలని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌ను సీఎం కోరారు. ఆక్వా రంగాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని.. ఏపీ నుంచి ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు విజ్ఞప్తి చేశారు. ఆక్వా రంగంలో జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను సీఎం చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయటంతో పాటు ఎప్పటికప్పుడు సహకారం అందించేందుకు వీలుగా జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని సీఎం మరో లేఖలో కేంద్రమంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌ను కోరారు. ఈ ఏడాది జూన్ 5న విశాఖలో జరిగిన సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ వర్క్‌షాప్‌లో అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. రాజధాని పరిధిలోని నెక్కల్లులో 7.89 ఎకరాల ప్రభుత్వ భూమిని దీనికోసం కేటాయించామన్నారు. తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. 2028 నాటికి ప్రాంతీయ కార్యాలయం, అక్వేరియం, శిక్షణ కేంద్రాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

ఈ ప్రాంతీయ కేంద్రం బ్లూ ఎకానమీ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుతుందన్నా రు. పొగాకు ఎగుమతిని ప్రోత్సహించాలని కోరారు. ఏరియే టర్లు, ప్రాసెస్ చేయని పొగాకుపై జీఎస్టీ తగ్గించాలన్నారు. బ్లూ ఎకానమీకి సహకారం ఇవ్వాలని.. సీఎం కోరారు. నిర్యాత్ ప్రోత్సాహన్ పథకాన్ని వర్తింపచేయాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుపై రూ.5 లక్షల టాప్ అప్ ఇవ్వాలని కేంద్ర మంత్రులకు రాసిన లేఖలో సీఎం చంద్రబాబు వినతి చేశారు.

# తెలుగు భాష, సంస్కృతి వైభవానికి రెండు ప్రతిష్టాత్మక ఉత్సవాలు

**జూలై 25, 26న 'ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవం'**

**ఆగస్టు 8, 9న 'అమరావతి చిత్రకళా వీధి'**

**విజయవాడ, జూలై 20 :** రాష్ట్రంలో తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతికి పునర్వైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర సృజనాత్మకత మరియు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు. విజయవాడ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ, నృత్య సంగీత కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే సాంస్కృతిక రాజధానిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ దిశగా జూలై 25, 26 తేదీలలో ఉండవల్లి గుహల ప్రాంగణంలో 'ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవం' ను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలుగు భాషను కేవలం మాట్లాడే భాషగా కాకుండా, భావితరాలకు వారసత్వంగా అందించే లక్ష్యంతో ఈ మహోత్సవాన్ని రూపొందించినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో 'సూర్యోదయ సుప్రభాతం' సంగీత కార్యక్రమం, 'ఆమె మాట అక్షర బాట', కవి సమ్మేళనాలు, 'అమ్మమ్మ కథల ముచ్చట్లు', 'నెక్స్ట్ జెన్ తెలుగు' యువతతో చర్చలు, 'నవస్వరం' ప్యానెల్ డిస్కషన్లు, తపాలా శాఖ సహకారంతో పూర్తిగా తెలుగులో పోస్టుకార్డులు రాసే వినూత్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 8, 9 తేదీలలో గుంటూరు విద్యానగర్ రింగ్ రోడ్డులో 'అమరావతి చిత్రకళా వీధి' పేరుతో ఓపెన్ ఎయిర్ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది రాజమండ్రిలో 550 మంది కళాకారులతో విజయవంతంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఈసారి 800 స్టాల్స్‌తో మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర చిత్రకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు స్వరాష్ట్రంలోనే విశాల వేదిక కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లు ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాలను రూపొందించినట్లు తేజస్వి పేర్కొన్నారు.జూలై 26 సాయంత్రం జరిగే తెలుగు మహోత్సవం ముగింపు సభకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ నిర్వహణలో జరిగేవి మాత్రమే కాకుండా, కళాకారులు, రచయితలు, సాహితీవేత్తలు, సాంస్కృతిక సంస్థలు, యువత, ప్రజలందరూ భాగస్వాములై తెలుగు సంస్కృతి పరిరక్షణకు తోడ్పడాలని తేజస్వి పొడపాటి పిలుపునిచ్చారు.




# పీపీపీ విధానంపై ప్రశ్నించే నైతిక హక్కు వైసీపీకి లేదు

**పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

**అమరావతి, జులై 20 :** రామాయపట్నం పోర్టు పీపీపీ విధానంపై ప్రశ్నించే నైతిక హక్కు వైసీపీకి లేదని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్లలో ఈ విధానాన్ని ఎప్పుడైనా వ్యతిరేకించారా అని ప్రశ్నించారు గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను ప్రైవేట్ సంస్థకు విక్రయించినప్పుడు ఈ సిద్ధాంతాలు ఎక్కడికి వెళ్లాయని ఆగ్రహం వ్యక్తం చేసారు. వైసీపీ హాయాంలో 95% రామాయపట్నం పోర్టులు పూర్తయ్యాయనేది అవాస్తవం అని గుర్తు చేసారు. జూన్ 2024 నాటికి పోర్టు పనులు 50% మాత్రమే పూర్తి అయ్యాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక 80.50% వరకు పూర్తి చేశాం అన్నారు. దేశంలో 91% పోర్టులు ఇదే విధానంలో విజయవంతంగా నడుస్తున్నాయని అన్నారు. కృష్ణపట్నం, కాకినాడ, గంగవరం వంటి పోర్టులు 29 ఏళ్లుగా ఈ విధానంలోనే విజయవంతంగా పనిచేస్తున్నాయని గుర్తు చేసారు. రాబోయే రోజుల్లో 3 గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల అభివృద్ధికి రూ. 50 వేల కోట్లకు పైగా పెట్టుబడులు అవసరం అని పేర్కొన్నారు. పీపీపీ ద్వారానే పెట్టుబడులు, ఉద్యోగాలు, ప్రభుత్వ ఆదాయం మెరుగవుతాయని అన్నారు.

# అంబటి ఆరోపణలు అవాస్తవం

**ఆధారాలుంటే చూపాలని ఎమ్మెల్యే మాధవి సవాల్**

**గుంటూరు, జూలై 20 :** మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలని తెలుగుదేశం పార్టీ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి డిమాండ్ చేశారు. ఆధారాలు చూపకపోతే ఆయనపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. సోమవారం గుంటూరు జిల్లాలో మాధవి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. గుంటూరులో మహిళపై జరిగిన ఘటనను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం దుర్మార్గమని మాధవి పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. అంబటి రాంబాబు విడుదల చేసిన వీడియో పూర్తిగా కల్పిత కథనమని చెప్పుకొచ్చారు. ఈ ఘటనపై వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. నిందితులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించామని అన్నారు. మహిళల భద్రత విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి రాజీ ఉండబోదని గల్లా మాధవి స్పష్టం చేశారు.



# ఏపీ యువతకు టూరిజం గైడ్స్‌గా ఉపాధి అవకాశాలు : మంత్రి కందుల

**అమరావతి, జులై 20 :** జైపూర్ లో టూరిజం గైడ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ నరేంద్ర సింగ్ రాథోర్ తో మంత్రి కందుల దుర్గేష్ భేటీ అయ్యారు. ఏపీకి రండి అని యువతకు గైడ్స్ గా శిక్షణ ఇవ్వండి అని టూరిజం గైడ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కు అధికారిక ఆహ్వానం పలికారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రాజస్థాన్ లోని జైపూర్‌లో రెండో రోజు పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్ టూరిస్ట్ గైడ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ నరేంద్ర సింగ్ రాథోర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2026 వార్షిక బడ్జెట్‌లో పర్యాటక, ఆతిథ్య రంగాలకు విశేష ప్రాధాన్యం కల్పించిందని.. అందులో భాగంగా పర్యాటక రంగంలోని 20 కీలక విభాగాలలో 10,000 మంది యువతకు టూరిజం అండ్ హాస్పిటాలిటీ స్కిల్ కౌన్సిల్ వంటి సంస్థల ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ అందించాలని నిర్ణయించిన అంశాన్ని గుర్తుచేశారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఆల్ ఇండియా టూరిజం గైడ్స్ ఫెడరేషన్ సహకారంతో ఎక్కువ మంది ఆంధ్రప్రదేశ్ యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించి వారిని ప్రొఫెషనల్ టూర్ గైడ్స్‌గా తీర్చిదిద్దాలని మంత్రి దుర్గేష్ ఆయనను కోరారు. తద్వారా స్థానిక యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో పర్యాటక సేవలను మెరుగుపరచడంతో పాటు, స్థానికంగా పర్యాటక రంగంలో వస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడం , వారికి శిక్షణను అందించేందుకు త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాలని ఫెడరేషన్ ప్రతినిధులను మంత్రి కందుల దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు. పర్యాటక ప్రాంతాలలో సందర్శకులకు మెరుగైన సేవలందించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన 'ఏఐ డిజిటల్ గైడ్స్'తో పాటు, శిక్షణ పొందిన గైడ్స్ కూడా అందుబాటులో ఉంటారని మంత్రి దుర్గేష్ తెలిపారు. పర్యాటకులు తమ పర్యటనల్లో వ్యక్తిగత గైడ్స్ కావాలని కోరుకుంటే ఈ శిక్షణ పొందిన యువత ఎంతగానో దోహదపడతారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యంలో పర్యాటక రంగం ద్వారా రాష్ట్రంలోయువతకు భారీగా ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ పునరుద్ఘాటించారు. పర్యటనలో మంత్రి దుర్గేష్ తో పాటు ఏపీ పర్యాటక స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ ఉన్నారు.

# తొలి డెంగీ వ్యాక్సిన్‌కు కేంద్రం ఆమోదం



డెంగీని నివారించే తొలి వ్యాక్సిన్‌కు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. జపాన్‌కు చెందిన టకేడా బయోఫార్మాస్యూటికల్స్ తయారుచేసిన వ్యాక్సిన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 4 నుంచి 60 ఏళ్ల వయసువారు ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చు. గతంలో డెంగీ బారిన పడ్డారా? లేదా అన్న దాంతో సంబంధం లేకుండా ముందస్తు వ్యాక్సినేషన్ టెస్టింగ్ ఏమీ లేకుండానే ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చు. డెంగీకి కారణమయ్యే 4 రకాల వైరస్ సీరోటైప్‌ల నుంచి రక్షణ కల్పిస్తుంది. 0.5 ఎంఎల్ చొప్పున మూడు నెలల వ్యవధిలో రెండుసార్లు ఈ వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుంది. డబ్ల్యూహెచ్‌వో సిఫార్సు చేసిన ఈ వ్యాక్సిన్ ఇప్పటికే ఆసియాలోని 43 దేశాల్లో ఆమోదం పొందింది. భారత్‌లో ఏటా వేలాది మంది దోమల వల్ల వ్యాపించే డెంగీ బారిన పడుతున్నారు. 2025లో సుమారు లక్షకుపైగా కేసులు నమోదు కాగా.. నమోదు కాని సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుందనేది అంచనా. ప్రపంచంలో నమోదయ్యే డెంగీ కేసుల్లో మూడోవంతు భారత్‌లోనే నమోదు అవుతున్నవేళ ఈ వ్యాక్సిన్‌కు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆమోదం తెలపడం గమనార్హం. రెండు డోసులు పూర్తయిన తర్వాత డెంగీ వల్ల ఆసుపత్రిలో చేరాల్సిన అవసరాన్ని ఈ వ్యాక్సిన్ 84.1 శాతం వరకు నిరోధించినట్లు క్లినికల్ ట్రయల్స్‌లో తేలింది.






## సెన్సెక్స్ 443 పాయింట్లు డౌన్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా మళ్లీ క్రూడాయిల్ ధరలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, దేశీయంగా బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి తదితర కారణాలు సూచీలపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఓ దశలో 700 పాయింట్లు కోల్పోగా.. ఆఖర్లో కోలుకుంది. నిఫ్టీ ఫార్మా, మెటల్ స్టాక్స్ రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 88 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4021 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. సెన్సెక్స్ ఉదయం 78,151.45 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఆపై నష్టాల్లోకి జారుకున్న సూచీ.. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా నష్టంతో 77,368.29 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 442.93 పాయింట్ల నష్టంతో 77,708.52 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 95.80 పాయింట్ల నష్టంతో 24,238.50 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.44గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ట్రెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ లాభపడ్డాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ భగ్గుమనడంతో క్రూడాయిల్ ధరలకు రెక్కలొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ఇంట్రాడేలో 4 శాతం పెరిగి 91 డాలర్ల స్థాయికి చేరింది. దీంతో ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. ఆసియా మార్కెట్లు కూడా బలహీనంగా ప్రారంభం కావడం మన మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పీ 4 శాతం చొప్పున నష్టపోయాయి. దేశీయంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. శనివారం త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన ఈ బ్యాంకుల మార్జిన్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 5 శాతం, యాక్సిస్ బ్యాంక్ 6 శాతం మేర పతనమయ్యాయి.



## రో-కో వరల్డ్ కప్ ఆడాలనుకుంటే వారికి స్పష్టత ఇవ్వాలి

### బీసీసీఐకి యువీ రిక్వెస్ట్

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల వన్డే భవిష్యత్తుపై వారికి పూర్తి స్పష్టత ఇవ్వాలని బీసీసీఐ, జట్టు యాజమాన్యాన్ని భారత మాజీ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ కోరాడు. 2027 వరల్డ్ కప్ కోసం టీమ్‌ఇండియా ప్రణాళికల్లో తాము ఉన్నామో, లేదో తెలుసుకునే హక్కు వారికి ఉందన్నాడు. రో-కో విషయంలో నెలకొన్న అనిశ్చితి తన అంతర్జాతీయ కెరీర్ చివరి రోజులను గుర్తుచేసిందని యువరాజ్ పేర్కొన్నాడు. "రోహిత్, విరాట్ ప్రస్తుతం ఉన్నటువంటి పరిస్థితిని నేను కూడా గతంలో ఎదుర్కొన్నా. వారు ఆడాలా? వద్దా అని నిర్ణయించే అధికారం అభిమానులకు లేదు. ఆ నిర్ణయం తీసుకోవాల్సింది జట్టు యాజమాన్యం, కోచ్, సెలెక్టర్లే. రోహిత్, కోహ్లీ ప్రపంచ కప్ ఆడాలని మేనేజ్‌మెంట్ కోరుకుంటే.. 'మిత్రులారా.. మీరు ప్రపంచ కప్ ఆడాలని మేం కోరుకుంటున్నాం. మీకు మా పూర్తి మద్దతు ఉంటుంది. మైదానంలోకి వెళ్లి మీ సహజ శైలిలో ఆడండి. ఒకవేళ ఏదైనా సిరీస్ సరిగా ఆడకపోతే జట్టులో స్థానం కోల్పోతామనే ఒత్తిడిని అస్సలు పెట్టుకోవద్దు' అని చెప్పాలి. మేనేజ్‌మెంట్ వారికి స్పష్టత ఇవ్వాలి. నాకూ ఇలాంటి పరిస్థితి ఎదురైంది. అప్పుడు నాకు క్లారిటీ ఇవ్వలేదు. ఇన్నేళ్లపాటు దేశానికి ప్రాతినిధ్యం వహించిన ఎవరికైనా ఇలాంటి పరిస్థితి రావొద్దు. ఒకవేళ ఎవరైనా మీ భవిష్యత్ ప్రణాళికల్లో భాగం కాకపోతే వారితో నిజాయితీగా ఉండండి. ఆ నిర్ణయం తీసుకోవడం కష్టంగా అనిపించవచ్చు. పైకి అది బాగోలేదని కూడా అనిపించవచ్చు. కానీ, మీరు ఆ విషయాన్ని వారికి ముఖం మీదే చెప్పినందుకు వారు కచ్చితంగా అభినందిస్తారు" అని యువీ వివరించాడు. ఆదివారం లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో రోహిత్ (138; 110 బంతుల్లో) సెంచరీ బాదగా.. కోహ్లీ 74 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత్ 27 పరుగుల తేడాతో ఓటమిపాలై సిరీస్‌ను 1-2తో చేజార్చుకుంది.

# అలాంటి ప్రచారం లేకపోతే మజా ఉండదు

### 'రిటైర్మెంట్' వార్తలపై రోహిత్



భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తన రిటైర్మెంట్‌పై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించాడు. తన మనసులో ఆ ఆలోచనే లేదని స్పష్టం చేశాడు. లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో రోహిత్ సెంచరీ చేసిన సంగతి తెలిసిందే. దీని కంటే ముందు కొన్ని మ్యాచ్‌ల్లో రోహిత్ బ్యాట్ నుంచి ఎక్కువ పరుగులు రాలేదు. దీంతో లార్డ్స్ వన్డే హిట్‌మ్యాన్‌కు ఆఖరిదని, అతడు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని వార్తలొచ్చాయి. ఈ క్రమంలోనే సిరీస్ ముగిసిన తర్వాత బీసీసీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వదంతులకు రోహిత్ చెక్ పెట్టాడు. "దేశానికి ప్రాతినిధ్యం వహించడం, బ్యాట్‌తో రాణించడమే నా పని. అరంగేట్రం చేసినప్పటి నుంచీ నాకు ఇదే చెబుతున్నారు. నేను అదే ఫాలో అవుతున్నా. చాలా కాలంగా నా రిటైర్మెంట్‌పై చర్చలు, విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. నేను ఆడుతున్నంత కాలం ఇలాంటి ప్రచారం జరుగుతూనే ఉంటుంది. ఆ విషయాలు నాకు అనవసరం. మైదానంలో నేను ఏం చేస్తున్నానన్నదే ముఖ్యం. జట్టు విజయానికి నా వంతు సహకారం అందించడానికి ప్రయత్నిస్తాను. నా దృష్టి అంతా ఇప్పుడు దాని మీదే ఉంది. అయినా అలాంటి ప్రచారం లేకపోతే మజా ఉండదు" అని రోహిత్ పేర్కొన్నాడు.

### కోహ్లీతో బ్యాటింగ్ సరదాగా ఉంటుంది..

కాగా.. లార్డ్స్ వన్డే రోహిత్, కోహ్లీ కలిసి ఆడిన 400వ అంతర్జాతీయ మ్యాచ్. ఈ మ్యాచ్‌లో రో-కో జోడీ రెండో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. వన్డేల్లో వీరిద్దరి మధ్య ఇది 21వ శతక భాగస్వామ్యం. ఈ నేపథ్యంలో కోహ్లీతో కలిసి బ్యాటింగ్ చేయడం గురించి రోహిత్ మాట్లాడాడు. "మేము మా కెరీర్ అంతా కలిసి ఆడాం. మైదానంలో అతడు నాతో ఉండటం చాలా బాగుంటుంది. మా మధ్య ఎన్నో భాగస్వామ్యాలు ఉన్నాయి. కోహ్లీతో కలిసి బ్యాటింగ్ చేయడం ఎప్పుడూ సరదాగా ఉంటుంది. ఒకరినొకరం బాగా అర్థం చేసుకుంటాం. మైదానంలో ఆలోచనలను పంచుకుంటూ జట్టు కోసం ఏం చేయాలనే దానిపై చర్చించుకుంటాం" అని హిట్‌మ్యాన్ పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో గెలవడం కోసం భారత్ చివరి వరకు పోరాడిందని, 27 పరుగుల తేడాతో ఓడిపోవడంతో కాస్త నిరాశ చెందానని రోహిత్ తెలిపాడు.



## 20 శాతానికి మించి ఇథనాల్ బ్లెండింగ్‌పై నిర్ణయం తీసుకోలేదు

**దిల్లీ:** పెట్రోల్‌లో 20 శాతానికి మించి ఇథనాల్ కలిపే అంశంపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి తెలిపారు. శాస్త్రీయ పరిశోధనలు, ఆటోమొబైల్, ఆయిల్ మార్కెటింగ్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్లతో సంప్రదింపులు జరిపాకే తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ మేరకు రాజ్యసభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. నిర్ణీత గడువు కంటే ముందే భారత్ 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని చేరుకుందని సురేశ్ గోపి ఈ సందర్భంగా తన సమాధానంలో పేర్కొన్నారు. 2013-2014లో 1.53 శాతం మాత్రమే ఉన్న బ్లెండింగ్‌ను 2025-26 నాటికి 20 శాతానికి చేర్చామన్నారు. 2014-15 నుంచి ఇప్పటి వరకు ఇథనాల్ ప్రోగ్రామ్ కింద రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారకాన్ని ఆదా చేసినట్లు తెలిపారు. 316 లక్షల టన్నుల క్రూడాయిల్ ఆదా అవ్వడంతో పాటు 952 లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గింపు సాధ్యమైందని తెలిపారు. రైతులకు రూ.1.66 లక్షల కోట్ల ఆదాయం సమకూరిందని తెలిపారు. ఇ20 ఇంధనానికి సంబంధించి ఇంజిన్ వైఫల్యం, ఫ్యూయల్-పంప్ సమస్యలు, తుప్పు పట్టడం వంటి విషయాల్లో వాహన తయారీదారులు, ఆటోమొబైల్ సంఘాలు లేదా వినియోగదారుల బృందాల నుంచి ప్రభుత్వానికి ఎలాంటి ఫిర్యాదులూ అందలేదని తెలిపారు. మీడియా, సోషల్ మీడియాలో వ్యక్తమైన ఆందోళనలను ప్రభుత్వం పరిశీలించిందని మంత్రి వెల్లడించారు. దేశంలో 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఈ20 సర్టిఫికేషన్‌తో నడుస్తున్నాయని తెలిపారు. బ్లెండింగ్ చేయని, లేదా తక్కువ బ్లెండింగ్ కలిగిన పెట్రోల్‌ను వేర్వేరుగా విక్రయించే అంశం ఏదీ ప్రతిపాదనలో లేదని సురేశ్ గోపి పేర్కొన్నారు.



## రోహిత్ రిటైర్మెంట్ ప్లాన్లు ఏవీ చర్చించలేదు : శుభ్‌మన్ గిల్

తన ఫామ్‌పై వస్తోన్న విమర్శలకు రోహిత్ శర్మ బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాడు. లార్డ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఓడినప్పటికీ.. రోహిత్, విరాట్ బ్యాటింగ్ ఆకట్టుకుంది. మరీ ముఖ్యంగా వన్డే ఫార్మాట్‌లో లార్డ్స్‌లో సెంచరీ చేసిన తొలి భారత బ్యాటర్‌గా ఘనత సాధించాడు. ఆ శతకం తర్వాత ఆటకు వీడ్కోలు పలుకుతాడని ప్రచారమూ సాగింది. కానీ, అలాంటిదేమీ లేదంటూ భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టతనిచ్చాడు. ఇప్పటి వరకు జట్టులో అలాంటి చర్చే జరగలేదని వెల్లడించాడు. దీంతో రోహిత్‌ను వచ్చే వన్డే ప్రపంచకప్‌లోనూ ఆడించాలనే డిమాండ్లు మరింత పెరిగాయి. "ఇదే తన చివరి మ్యాచ్ అని రోహిత్ మాతో అనలేదు. ఇదంతా సోషల్ మీడియాలో మొదలైన చర్చే. గత కొన్నేళ్లుగా రోహిత్ - విరాట్ అద్భుతమైన ఆటతీరుతో జట్టుకు సేవలు అందించారు. ఈ మ్యాచ్‌లోనూ చక్కని భాగస్వామ్యం నిర్మించారు. ఇక, రోహిత్ భాయ్ బ్యాటింగ్ అదిరిపోయింది. రెండో ఇన్నింగ్స్ సమయంలో పిచ్ మందకొడిగా మారింది. ఇక్కడ పరుగులు చేయడం చాలా కష్టం. కానీ, అతడి ఆట మాత్రం అద్భుతంగా ఉంది" అని గిల్ వివరించాడు. ఇక, ఇంగ్లాండ్‌తో మూడో వన్డే ఓటమిపై గిల్ మాట్లాడాడు. "మేం బౌలింగ్‌లో ఇంకొన్ని పరుగులు తక్కువ ఇవ్వాల్సింది. 45వ ఓవర్ వరకు మేం సరైన ట్రాక్‌లోనే ఉన్నాం. ఆ తర్వాతే కాస్త గాడి తప్పినట్లు అనిపించింది. చివరి మూడు ఓవర్లలో ఎక్కువగా పరుగులు ఇచ్చేశాం. దీంతో మా నుంచి మ్యాచ్ కాస్త దూరమైంది. బ్యాటింగ్‌లో చివరి వరకూ పోరాడాం" అని గిల్ వెల్లడించాడు.

# ఒక ఛాంపియన్‌ను ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదు



### సింధుపై సైనా ప్రశంసలు

ఇటీవల జపాన్ ఓపెన్‌లో చరిత్రాత్మక విజయాన్ని అందుకున్న పి.వి.సింధుపై మాజీ స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ప్రశంసలు కురిపించారు. ఒక ఛాంపియన్‌ను ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదని, జపాన్ ఓపెన్‌లో విజేతగా నిలిచి తనకు మరిన్ని టైటిళ్లు సాధించే సత్తా ఉందని సింధు చాటి చెప్పిందని సైనా పేర్కొన్నారు. ఆదివారం ఉత్కంఠభరితంగా సాగిన జపాన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో సింధు 21-17, 21-17తో ప్రపంచ మూడో ర్యాంకర్ అకానె యమగూచి (జపాన్)ని ఓడించి ఈ టైటిల్ చేజిక్కించుకున్న తొలి భారత షట్లర్‌గా ఘనత సాధించింది. 2019లో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ తర్వాత ఆమెకు ఇదే అతిపెద్ద విజయం. "గడిచిన రెండు, మూడు సంవత్సరాలు నిజానికి చాలా కఠినంగా గడిచాయి. గాయాల నుంచి బయటపడి జపాన్ ఓపెన్‌లో సింధు ప్రాంరాఅఅసష్త్రబ) అగ్రశ్రేణి షట్లర్లను ఓడించింది. అటాకింగ్ గేమ్‌తో చాలా సునాయసంగా సూపర్ సిరీస్ విజయం సాధించింది. సింధుకు మరిన్ని టైటిళ్లు సాధించే సత్తా ఉందని ఈ సిరీస్‌తో నిరూపితమైంది. వయసు పెరిగే కొద్దీ గాయాలు వెంటాడుతాయి. ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. పెద్ద టోర్నీలో ఆడినప్పుడు ఒత్తిడి ఉంటుంది. అందుకే ఆమె కొంత ఒత్తిడి, ఆందోళనకు గురువుతోంది. కానీ, ఈ టోర్నీలో గెలిచిన తర్వాత ఆమెలో తిరిగి ఆత్మవిశ్వాసం వచ్చిందని అనుకుంటున్నా. సింధు ఎన్నో ఏళ్లుగా పెద్ద టోర్నీలు ఆడుతోంది. మున్ముందు ఇదే జోరు కొనసాగిస్తుందనే నమ్మకం ఉంది" అని సైనా నెహ్వాల్ వివరించారు.




## ఈక్విటీలపై ఎల్‌టీపీజీ రద్దు ప్రతిపాదన లేదు : కేంద్రం

ఈక్విటీల్లో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడంలో భాగంగా దీర్ఘకాల మూలధన లాభాల పన్నును పూర్తిగా తొలగించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్న వేళ.. కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎల్‌టీసీజీ ట్యాక్స్ రద్దు చేసే అంశంపై ప్రస్తుతం ఎలాంటి ప్రతిపాదన లేదని స్పష్టంచేసింది. బడ్జెట్ ప్రక్రియలో భాగంగా మూలధన లాభాల రేట్లు సహా పన్ను విధానాలను క్రమానుగతంగా సమీక్షిస్తామని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పార్లమెంట్‌లో వెల్లడించారు. 2024-25 మదింపు సంవత్సరంలో రూ.72,249 కోట్లు ఎల్‌టీపీజీ ట్యాక్స్‌ను వసూలు చేసినట్లు పంకజ్ చౌదరి వెల్లడించారు. 2025-26 మదింపు సంవత్సరంలో ఈ పన్ను వసూళ్లు 78 శాతం పెరిగి రూ.1,29,158 కోట్లకు చేరినట్లు తెలిపారు. రెండేళ్లలో మూలధన లాభాలపై పన్ను రూపేణా రూ.2.01 లక్షల కోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. సాధారణంగా షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్స్‌ను దేశీయ, రిటైల్ ఇన్వెస్టర్లు 12 నెలల కంటే ఎక్కువకాలం పాటు హోల్డ్ చేస్తే వాటిని లాంగ్ టర్మ్ అసెట్స్‌గా పరిగణిస్తారు. వీటిపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్నును వసూలు చేస్తారు. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షల కంటే ఎక్కువ ఆర్జించిన మొత్తానికే ఈ పన్ను వర్తిస్తుంది. అయితే, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెట్టుబడులను పెద్దమొత్తంలో తరలించుకుపోయిన నేపథ్యంలో లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ విషయంలో కేంద్రం కీలక మార్పు చేసింది. ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఎఫ్‌పీఐల పెట్టుబడులపై పన్నును పూర్తిగా మినహాయింపు ఇస్తూ కేంద్రం ఓ ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈక్విటీ పెట్టుబడులపై మాత్రం దేశీయ పెట్టుబడిదారులతో సమానంగా విదేశీ మదుపర్లు కూడా 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

జనం వార్త





## కొరియన్ కనకరాజులో రాసా గుమ్మడి పాట విడుదల

'మాస్ మెచ్చే అన్ని అంశాలు ఉన్న సినిమా 'కొరియన్ కనకరాజు అన్నారు దర్శకుడు మేర్లపాక గాంధీ. ఆయన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ హీరోగా నటించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తం గా నిర్మించాయి. రితికా నాయక్ కథానాయిక. సత్య కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఆగస్టు 7న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర రెండో గీతాన్ని విడుదల చేశారు. 'రాసా గుమ్మడి' అంటూ రాయలసీమ జాతర నేపథ్యంలో సాగే ఈ మాస్ పాటకు తమన్ స్వరాలు సమకూర్చారు. కాసర్ల శ్యామ్ సాహిత్యమం దించారు. నల్గొండ గద్దర్ ఆలపించారు. ఈ పాటలో వరుణ్ - దక్ష నగార్కర్ వేసి న మాస్ స్టెప్పులు.. వాళ్లిద్దరి కెమిస్ట్రీ ఆకర్షణగా నిలిచాయి. వరుణ్ తేజ్ మాట్లాడు తూ.. 'ఈ పాట అందరికీ నచ్చిందనుకుంటున్నా. మా పెద్దనాన్న చిరంజీవిని దృష్టిలో పెట్టుకుని ఈ పాటకి డ్యాన్స్ చేశా' అన్నారు. 'ఇందులో వరుణ్ యాక్షన్.. సత్యతో కలిసి చేసిన కామెడీ.. అన్నీ అలరిస్తాయని అన్నారు మేర్లపాక గాంధీ.

## పీవీ సింధుకు రాజమౌళి శుభాకాంక్షలు

### మీ మూవీలో పరిచయ నటిగా ఛాన్స్ ఇమ్మంటూ షట్లర్ రిప్లై





జపాన్ ఓపెన్ టైటిల్ విజేతగా నిలిచి భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగు తేజంపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో అగ్ర దర్శకుడు రాజమౌళి పోస్ట్‌కు సింధు ఇచ్చిన రిప్లై అందరినీ ఆకర్షిస్తూనే నెట్టింట ఆసక్తికర చర్చకు దారి తీసింది. సింధును అభినందిస్తూ రాజమౌళి ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. జపాన్ ఓపెన్ గెలిచిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించావు. మంచి కమ్ బ్యాక్ ఇచ్చావు. కంగ్రాట్స్ సింధు. నిన్ను చూసి దేశం గర్విస్తోందని శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందించిన ఆమె.. ధన్యవాదాలు రాజమౌళి సర్. మీ వారణాసి కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఒకవేళ మీరు తెరకెక్కించే ఏ సినిమాలో అయినా బ్యాడ్మింటన్ ప్లేయర్ పాత్ర ఉంటే.. మీ పరిచయ నటిగా మారడానికి నేను ఎంతో సంతోషిస్తాను' అంటూ నవ్వుతున్న ఎమోజీలను పంచుకున్నారు. ప్రస్తుతం సింధు రిప్లై నెట్టింట వైరల్ అవుతుండగా.. త్వరలోనే సినిమాల్లోకి రానుందా అనే చర్చ మొదలైంది. రాజమౌళికి క్రీడాకారుల నుంచి ఈ తరహా రిక్వెస్ట్‌లు రావడం ఇదేం తొలిసారి కాదు. గతంలో ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ కూడా జక్కన్నకు ఇలాంటి రిప్లై ఇచ్చారు. తెలుగు సినిమా పాటలకు తనదైన స్టైల్‌లో డ్యాన్స్ వేస్తూ పోస్ట్‌లు పెట్టే వార్నర్‌కు.. మన దర్శకధీరుడు 'బాహుబలి' కీరిటాన్ని కూడా పంపారు. ఇక 'వారణాసి' విషయానికొస్తే.. దీని షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. అక్టోబర్ నాటికి పూర్తి చేసి వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిలీజ్ చేయనున్నారు

## నా మాటలు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు

### కె ర్యాంపు, అబ్సెషన్ వ్యాఖ్యలపై కిరణ్ అబ్బవరం




తన చిత్రం 'కే-ర్యాంప్', హాలీవుడ్ మూవీ 'అబ్సెషన్' కథలు ఒకేలా ఉంటాయని కామెంట్ చేసి నెటిజన్ల ట్రోలింగ్‌కు గురయ్యారు హీరో కిరణ్ అబ్బవరం. అయితే, తన మాటలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని, ఆ హాలీవుడ్ చిత్రాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదంటూ తాజాగా ఆయన వివరణ ఇచ్చారు. తన తదుపరి చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ' ప్రమోషన్లలో భాగంగా ఈ వివాదంపై ఆయన స్పందించారు. నా మాటలను ఎందుకు నెగెటివ్‌గా తీసుకుంటున్నారో అర్థం కావడంలేదు. ఈ మధ్య నా స్నేహితులు ఫోన్ చేసి 'అబ్సెషన్' సినిమా చూశావా? అని అడిగారు. షూటింగ్‌లో బిజీగా ఉండి చూడలేదని చెప్పా. ఆ సినిమాలో కూడా 'కే-ర్యాంప్' తరహాలోనే ఒక అమ్మాయి.. అబ్బాయి వెంటపడుతుందని చెప్పారు. దానికి నేను 'అయితే మన సినిమా, వాళ్లలా రూ.1500 కోట్లు సాధించలేకపోయింది' అని నవ్వుతూ బదులిచ్చా. అంతేగాని నేను ఆ రెండింటినీ పోల్చలేదు. ఈ వ్యాఖ్యలను కొందరు నెటిజన్లు తీవ్రంగా పరిగణించి, నన్ను ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. నా సినిమా కంటే కూడా ఇతర చిత్రాలను నేను ఎక్కువగా గౌరవిస్తాను. 'అబ్సెషన్'.. 'కె-ర్యాంప్' కంటే చాలా పెద్ద హిట్ సినిమా. ప్రపంచవ్యాప్తంగా దానికి మంచి గుర్తింపు ఉంది. ఆ చిత్రాన్ని నేను ఏమాత్రం కించపరచలేదు. నేను అన్న మాటలను పూర్తిగా చూస్తే అసలు విషయం అర్థమవుతుంది అని కిరణ్ స్పష్టం చేశారు. ఇక, కర్రీ బార్కర్ దర్శకత్వంలో వచ్చిన 'అబ్సెషన్' ప్రపంచవ్యాప్తంగా ఘన విజయం సాధించింది. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా, జైన్స్ నాని దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'కె-ర్యాంప్' సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 27.50 కోట్లు రాబట్టింది. ప్రస్తుతం కిరణ్ అబ్బవరం రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'చెన్నై లవ్ స్టోరీ'లో నటిస్తున్నారు. గౌరీ ప్రియ హీరోయిన్‌గా మెరవనున్నారు. ఈ మూవీ జులై 24న థియేటర్లలో విడుదల కానుంది.

## వరుస సినిమాలతో మమతా బైజు బిజీ

'ప్రేమలు' సినిమాతో సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన అందాలభామ మమితాబైజు ఇప్పుడు అన్ని భాషల్నీ కవర్ చేస్తూ వరుసపెట్టి సినిమాలు చేస్తున్నది. అగ్రహీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి ఆమె నటించిన 'జననాయగన్' చిత్రం ఈ నెల 23న విడుదలకానున్న విషయం తెలిసిందే. ఇక సూర్యతో ఆమె నటించిన తెలుగు సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఆగస్ట్ 14న విడుదల కానున్నట్టు తెలుస్తున్నది. దర్శకుడు వెంకీ అట్లూరి ఫ్యామిలీ, లవ్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక మలయాళంలో మమితా నటించిన 'బెత్లెహం కుటుంబ యూనిట్' ఆగస్ట్ 21న రిలీజ్ కానుంది. ఫహాద్ ఫాజిల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మమత సరికొత్త పాత్రలో కనిపించనున్నది. నివిన్ పాలీ హీరో. ఈ విధంగా విజయ్, సూర్య, నివిన్‌పాలీ వంటి ప్రముఖ నటుల సినిమాల్లో నటిస్తూ అద్భుతమైన కెరీర్‌ని కొనసాగిస్తున్నది మమితా బైజు.



## రాకా మూవీలో జాయిన్ అయిన నటి సిరి హన్మంతు

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో 'రాకా' సినిమా వస్తుందని తెలిసిందే. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ భాగమైనట్టు క్రేజీ అప్‌డేట్స్ వచ్చాయని తెలిసిందే. తాజాగా మరో ఆసక్తికర నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు నటి సిరి హన్మంతు 'రాకా' చిత్రంలో జాయిన్ అయింది. రీసెంట్‌గా జరిగిన ఓ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. సిరి హన్మంతు చివరగా సీతాపయనంలో మెరవగా.. త్వరలో విడుదల కానున్న ' చెన్నై లవ్ స్టోరీ' లో కూడా సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో ఇంతకీ సిరి హన్మంతు రాకా మూవీలో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ కొనసాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీని 2027 చివరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.





## జాతీయ అవార్డు రావడం మెగా విజయం

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా రూపొందించిన 'కమిటీ కుర్రోళ్ళు' చిత్రం జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది. గ్రామీణ నేపథ్యంతో, కొత్త నటీనటులతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రతిష్టాత్మక 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో రెండు అవార్డులు గెలుచుకుని తెలుగు సినీ పరిశ్రమకు మరోసారి గర్వకారణంగా నిలిచింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లో చిత్రబృందం ప్రత్యేక సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా మాట్లాడిన నిర్మాత నిహారిక కొణిదెల తన ఆనందాన్ని భావోద్వేగంతో పంచుకున్నారు. తమ కుటుంబానికి జాతీయ అవార్డులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ.. సరిగ్గా 36 ఏళ్ల క్రితం మా నాన్న నాగబాబు నిర్మాతగా రూపొందించిన తొలి చిత్రం 'రుద్రవీణ' మూడు జాతీయ అవార్డులు అందుకుంది. ఇప్పుడు నేను నిర్మాతగా పూర్తి బాధ్యతతో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' కూడా రెండు జాతీయ అవార్డులు గెలుచుకోవడం ఎంతో గర్వంగా, ఆనందంగా ఉంది. మా కుటుంబ చరిత్ర మరోసారి పునరావృతమైనట్టుగా అనిపిస్తోంది' అని తెలిపారు. నేషనల్ అవార్డు సాధించాలనే లక్ష్యంతో ఈ సినిమాను ప్రారంభించలేదని, అయితే దర్శకుడు యదు వంశీ చెప్పిన కథ విన్న తర్వాత ఈ చిత్రాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే బలమైన కోరిక తనలో కలిగిందని నిహారిక వెల్లడించారు. ఇప్పుడు ఆ కల నిజం కావడం ఎంతో సంతృప్తినిస్తోందని చెప్పారు. ఈ అరుదైన విజయంపై మెగాస్టార్ చిరంజీవి కూడా ఎంతో సంతోషం వ్యక్తం చేశారని, ఆయన నుంచి వచ్చిన ప్రశంసలు తనకు మరింత ప్రేరణనిచ్చాయని నిహారిక తెలిపారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com